మాదక ద్రవ్యాల రవాణాపై ఉక్కుపాదం : కలెక్టర్



వాల్మీకి చిత్రపటం వద్ద జ్యోతి వెలిగిస్తున్న కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు, చిత్రంలో మేయర్ నీతూ కిరణ్

నిజామాబాద్ కలెక్టరేట్, న్యూస్‌టుడే: మాదక ద్రవ్యాల వినియోగం, రవాణాపై ఉక్కుపాదం మోపేందుకు పోలీస్, ఆబ్కారీ, రవాణా శాఖల అధికారులు సమన్వయంతో ముందుకెళ్లాలని పాలనాధికారి రాజీవ్‌గాంధీ హన్మంతు పేర్కొన్నారు. కలెక్టరేట్‌లో గురువారం సీపీ కల్మేశ్వర్‌తో కలిసి జిల్లాస్థాయి మాదక ద్రవ్యాల నిరోధక కమిటీ సమావేశం నిర్వహించి మాట్లాడారు. జిల్లాలో గంజాయి సాగు లేకున్నా.. ఆంధ్ర, ఒడిశా సరిహద్దు ప్రాంతాలైన వైజాగ్, పాడేరు, అరకు తదితర చోట్ల నుంచి నిజామాబాద్ మీదుగా మహారాష్ట్రకు తరలిస్తున్నందున గట్టి నిఘా పెట్టాలన్నారు. గంజాయి విక్రయం, వినియోగం చేసేవారిని గుర్తించి కఠినంగా శిక్షించాలన్నారు. కల్తీ కల్లు తయారీకి వినియోగించే అల్ప్రాజోలం నిల్వలను పట్టుకోవాలన్నారు. గతేడాదితో పోలిస్తే ఈ ఏడాది గంజాయి కేసులు తగ్గాయని సీపీ కల్మేశ్వర్ తెలిపారు. నగరపాలక సంస్థ కమిషనర్ మకరందు, అదనపు డీసీపీ బస్వారెడ్డి, నిజామాబాద్ ఆర్డీవో రాజేంద్రకుమార్, ఆబ్కారీ శాఖ సూపరింటెండెంట్ మల్లారెడ్డి, డీఎంహెచ్‌వో రాజశ్రీ, ఆర్టీసీ ఆర్ఎం జానీరెడ్డి, డీఐఈవో రవికుమార్, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

మహనీయుల మార్గంలో నడవాలి

నిజామాబాద్ కలెక్టరేట్, న్యూస్‌టుడే: దేశం, సమాజాభివృద్ధికి కృషి చేసిన మహనీయుల మార్గంలో నడవాలని పాలనాధికారి రాజీవ్‌గాంధీ హన్మంతు సూచించారు. మహర్షి వాల్మీకి జయంతిని కలెక్టరేట్‌లో గురువారం అధికారికంగా నిర్వహించారు. మేయర్ నీతూకిరణ్‌తో కలిసి వాల్మీకి చిత్రపటానికి నివాళులర్పించి మాట్లాడారు. అధికారులు, పలు సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

స్పష్టత రాక.. ముందుకు సాగక..

ధాన్యం కొనుగోలులో జాప్యంతో రైతుల్లో ఆందోళన

ఈనాడు, నిజామాబాద్

జిల్లాలో ధాన్యం సేకరణకు సన్నద్ధత తుది దశకు చేరింది. కొనుగోలు కేంద్రాలు తెరిచేందుకు అధికారులు సహకార సొసైటీలకు అనుమతించారు. ఈ నేపథ్యంలోనే బోధన్ డివిజన్‌లో ఇప్పటికే పది కేంద్రాలు తెరిచినా.. కొనుగోలు ప్రక్రియ మాత్రం ఇంకా ప్రారంభంకాలేదు. కాంటా వేస్తే.. ఆ వివరాలు ఆన్‌లైన్ చేసే ఓపీఎంఎస్ పోర్టల్‌లో లాగిన్ గురువారం మధ్యాహ్నం ఇచ్చారు. ప్రస్తుతానికి కొనుగోలు జరిపే ఏజెన్సీల వివరాలు అందులో నమోదు చేయటం పూర్తయింది. అయితే కొనుగోలు అనంతరం వడ్లను గతంలో మాదిరి మిల్లుల్లో దించాలా.. కొత్త ఆలోచన మేరకు ప్రభుత్వ అధీనంలోనే ఉండేలా గోదాముల్లో ఉంచాలా అనే విషయంలో ఇంకా స్పష్టత రాలేదు. దీంతో కొనుగోళ్ల ప్రారంభించటంలో జాప్యం జరుగుతూ వస్తోంది.

గోదాములు సిద్ధం..

కొనుగోలు వివరాల నమోదు సాఫ్ట్‌వేర్ పోర్టల్ గురువారం సాయంత్రానికి కానీ అందుబాటులోకి రాలేదు. ఇంకా ఈ పోర్టల్‌లో మిల్లుల వివరాలు కూడా నమోదు చేయాల్సి ఉంది. ఇందుకు మిల్లర్లతో ఒప్పందాల సందర్భంలో ధాన్యం విలువకు బ్యాంకు పూచీకత్తుల అంశం, సీఎంఆర్‌లో తిరిగి ఇచ్చే బియ్యాన్ని కూడా తగ్గించాలనే డిమాండ్లపై స్పష్టత రావాల్సి ఉంది. అప్పుడే మిల్లర్లను ఎంపిక చేసి పోర్టల్‌లో నమోదు చేసే అవకాశం ఉంది. అయితే ఇప్పటికే జిల్లాలోని 185 ముడి బియ్యం మిల్లులు, 65 ఉప్పుడు మిల్లుల జాబితాను అధికారులు సిద్ధం చేసుకున్నారు. లారీలు, గన్నీ సంచుల టెండర్ల ప్రక్రియ పూర్తి చేశారు. సన్న రకాన్ని నిర్ధారించేందుకు నిర్దేశించిన పరికరాల కొనుగోలుకు టెండర్లు పిలిచారు. వీటిని ఖరారు చేయాల్సి ఉందంటున్నారు. ఇక ప్రభుత్వ ధాన్యం పక్కదారి పట్టిన ఉదంతాల నేపథ్యంలో ఈసారి మిల్లర్లకు కేటాయించిన బస్తాలు కూడా ప్రభుత్వమే నిల్వ ఉంచి అందించే ఆలోచన చేస్తోంది. ఇందుకోసం 35 వేల మెట్రిక్ టన్నుల సామర్థ్యం ఉన్న మార్కెట్ కమిటీల గోదాములు, మరో లక్ష మెట్రిక్ టన్నుల సామర్థ్యం కలిగిన ప్రైవేటు గోదాములను సిద్ధం చేసి ఉంచారు.

అన్నదాతల ఎదురుచూపులు



జిల్లాలోని బోధన్ డివిజన్‌లో 20 రోజుల కిందటే కోతలు మొదలు కాగా.. రైతులు పచ్చి ధాన్యాన్ని ప్రైవేటు వ్యాపారులకు విక్రయిస్తున్నారు. ప్రభుత్వం సన్నాలకు రూ.500 బోనస్ ఇస్తామని చెప్పినా.. కేంద్రం రూ.100 మద్దతు ధర పెంచినా రైతులు పంటను ఆపలేని పరిస్థితి ఎదుర్కొంటున్నారు. వాతావరణంలో మార్పుల కారణంగా అకాల వర్షాలు కురుస్తుండడంతో పంట నేలవాలితే నష్టపోతామని నూర్పిడి చేయిస్తున్నారు. కోసిన పంటను ఆరబెట్టడం, నిల్వ చేయటంలో ఇబ్బందులు ఎదురవుతుండడంతో కొనుగోలు కేంద్రాలు తెరిచే వరకు వేచిచూడలేక వ్యాపారులకు ఇచ్చేస్తున్నారు. అయితే కొన్ని సహకార సంఘాల్లో కేంద్రాలు ప్రారంభించినా.. కొనుగోళ్లు మాత్రం జరపటం లేదు. దీనికి భిన్న కారణాలున్నట్లుగా అధికారులు చెబుతున్నారు.



బోధన్ డివిజన్‌లో...

గుండె బరువు దించలేరా?



- రూ. 7 కోట్ల యంత్రం నిరుపయోగం
- ఏడాదిగా క్యాథ్‌ల్యాబ్ తాళం తీయలేదు

న్యూస్‌టుడే, నిజామాబాద్ వైద్యవిభాగం

అన్నీ ఉన్నా.. అల్లుడి నోట్లో శని అన్న చందంగా తయారైంది నిజామాబాద్ ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి పరిస్థితి. పుష్కర కాలం గడుస్తున్నా సూపర్ స్పెషాలిటీ వైద్య సేవలు అందుబాటులోకి రాలేదు. పక్కనే ఉన్న ఆదిలాబాద్ రిమ్స్ మనకంటే ఎంతో ముందుంది. ఉమ్మడి జిల్లా జనాభా 26 లక్షలు. వైద్యపరంగా అన్ని మండలాలకు నిజామాబాదే పెద్ద దిక్కు. జిల్లా నుంచి ప్రాతినిధ్యం వహించే నేతలు ప్రభుత్వంలో కీలకంగా ఉంటున్నా ప్రజలకు మెరుగైన వైద్యం కోసం వసతులు కల్పించడం లేదు. ఫలితంగా పేదలు ప్రైవేటును ఆశ్రయించి అప్పులపాలవుతున్నారు. 2023 అక్టోబరు 6న జీజీహెచ్‌లో హడావుడిగా క్యాథ్‌ల్యాబ్ ప్రారంభించినా.. తాళం ఇప్పటికీ తీయలేదంటే పరిస్థితి ఎంత దయనీయంగా ఉందో చెప్పనక్కర్లేదు.

డిప్యుటేషన్‌పై వచ్చి.. రద్దుతో వెళ్లి..

జీజీహెచ్‌లో క్యాథ్‌ల్యాబ్ సేవలు అందుబాటులోకి వచ్చాయని గొప్పగా చెప్పారు. రూ.7 కోట్ల విలువైన యంత్రం సైతం కేటాయించారు. దీని ద్వారా ఎంజియోగ్రామ్, స్టంట్ వేయడం తదితర గుండెకు సంబంధిత అన్ని చికిత్సలు చేసే వీలుంది. ఏడాది గడుస్తున్నా ఒక్క రోగికి వైద్యం అందలేదు. యంత్రం ఇన్‌స్టాలేషన్ సమయంలో ముగ్గురు కార్డియాలజిస్టులను ఇతర జిల్లాల నుంచి ఇక్కడికి డిప్యుటేషన్‌పై తెచ్చారు. తర్వాత కాంగ్రెస్ ప్రభుత్వం కొలువుదీరాక వాటిని రద్దు చేయడంతో ఎక్కడి వారు అక్కడికి వెళ్లిపోయారు. మరికొన్నాళ్లు గడిస్తే ఈ విలువైన పరికరం తుప్పు పట్టి ఎందుకూ పనికిరాకుండా పోతుంది.

ముందుగానే స్టంట్‌లు తెప్పించినా..

సూపరింటెండెంట్ ప్రతిమారాజ్ స్టంట్లు ఉంటేనే రోగులకు వేయడానికి వీలవుతుందనే ఆలోచనతో ఆర్నెల్ల క్రితమే టెండర్లు వేసి ముందుగానే తెప్పించారు. కానీ, కార్డియాలజిస్టులు లేకపోవడంతో వాటిని వినియోగించలేని పరిస్థితి.

జిల్లాలో జీవనశైలి వ్యాధుల బాధితులు

రక్తపోటు : 75,068 ★ మధుమేహం : 34,476



ఏడాది కిందట ప్రారంభించిన ల్యాబ్ పరిస్థితి

మెదడులో స్టంట్ వేసే వైద్య నిపుణుడు విష్ణువర్ధన్ మూడు నెలల కిందట ఇక్కడికి వచ్చారు. ఆయన సేవలను ఉపయోగించుకోవడం లేదు. ప్రైవేటులో స్టంట్ వేయాలంటే రూ.3 లక్షలకు పైగా వసూలు చేస్తున్నారు. గుండె వైద్యం చేయించుకునేందుకు కొంతమంది పేదలు తమ ఆస్తులు అమ్ముకోవాల్సి వస్తోంది.

ఎవరూ రావడం లేదు

- ప్రతిమారాజ్, జీజీహెచ్ సూపరింటెండెంట్

రెండుసార్లు కార్డియాలజిస్టు కోసం నోటిఫికేషన్ వేశాం. ఎవరూ రాలేదు. యంత్రం పాడయ్యే పరిస్థితి ఉందని ఉన్నతాధికారులు, మంత్రికి విన్నవించాం. డిప్యుటేషన్‌పై వచ్చిన వారు యథాస్థానాలకు వెళ్లకుండా నిజామాబాద్‌లోనే ఉంటున్నారు. వీరికి మళ్లీ డిప్యుటేషన్ వస్తే జీజీహెచ్‌లో పని చేసేందుకు సిద్ధంగా ఉన్నట్లు ఇన్‌ఛార్జి మంత్రి దృష్టికి తీసుకెళ్లా. త్వరలో పరిష్కారమయ్యే అవకాశం ఉంది.

నలుగురు తహసీల్దార్లకు నోటీసులు

ఈనాడు, నిజామాబాద్

ప్రభుత్వ కార్యక్రమాల్లో నిబంధనలు పాటించలేదనే ఫిర్యాదు మేరకు జిల్లాలో నలుగురు తహసీల్దార్లకు షోకాజ్ నోటీసులు జారీ అయ్యాయి. బాల్కొండ నియోజకవర్గంలో ఇటీవల కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కుల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. బాల్కొండ, వేల్పూర్, మోర్తాడ్, కమ్మర్‌పల్లి మండలాల్లో కార్యక్రమాల్లో ఫ్లెక్సీలపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చిత్రం లేదని స్థానిక నేతలు రాష్ట్ర ఖనిజాభివృద్ధి సంస్థ ఛైర్మన్ ఈరవత్రి అనిల్ దృష్టికి తీసుకెళ్లారు. ఆయన జిల్లా కలెక్టర్‌తో పాటు జీఏడీ అధికారులకు ఫిర్యాదు చేశారు. దీనిపై ఉన్నత స్థాయిలో స్పందించారు. చర్యలు ఎందుకు తీసుకోకూడదని జిల్లా అధికారులను వారు ప్రశ్నించారు. మూడురోజులుగా ఈ విషయమై ఉన్నతాధికారులు ఆరా తీస్తుండటంతో స్థానిక అధికారులు కొంత తర్జనభర్జనకు లోనయ్యారు. ఉన్నత స్థాయికి సంజాయిషీ ఇచ్చుకోవాల్సి వచ్చింది. కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు స్వయంగా ఫిర్యాదు చేసిన నేతతో పాటు హైదరాబాద్‌లోని ఉన్నతాధికారులతో మాట్లాడారు. ఇకపై పొరపాట్లకు అవకాశం ఇవ్వకుండా అప్రమత్తంగా ఉండేలా అధికారులను ఆదేశిస్తానని సర్దిచెప్పారు. ఈ వ్యవహారంలో నలుగురు తహసీల్దార్లకు షోకాజ్ నోటీసులను గురువారం జారీ చేశారు. మూడు రోజుల్లో సమాధానం ఇవ్వాలని అందులో పేర్కొన్నారు.

21 నుంచి పోలీసు సంస్మరణ వారోత్సవాలు

నిజామాబాద్ నేరవిభాగం, న్యూస్‌టుడే: పోలీసుల త్యాగాలు గుర్తు చేసుకోవడానికి ఈ నెల 21 నుంచి 31 వరకు నిజామాబాద్ కమిషనరేట్ పరిధిలో పోలీసు సంస్మరణ వారోత్సవాలు నిర్వహించనున్నామని కమిషనర్ కల్మేశ్వర్ శింగెనవార్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. నిజామాబాద్, ఆర్మూర్, బోధన్ డివిజన్లలోని అన్ని ఠాణాల్లో రక్తదాన శిబిరాలు, అమర వీరుల దినోత్సవం, కొవ్వొత్తులు, ద్విచక్ర వాహనాల ర్యాలీలు, వ్యాసరచన, ఫొటోగ్రఫీ, షార్ట్‌ఫిలిం పోటీలు నిర్వహించనున్నామని పేర్కొన్నారు. జాతీయ ఐక్యతా దినోత్సవంలో భాగంగా పోలీసు కళా బృందం, పోలీసు బ్యాండ్ ద్వారా అవగాహన కార్యక్రమాలు నిర్వహించనున్నామన్నారు.

శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు: సీపీ

నిజామాబాద్ నేరవిభాగం, న్యూస్‌టుడే : కమిషనరేట్ పరిధిలో ఈ నెల 31 వరకు ప్రజల శాంతి భద్రతలకు విఘాతం కలిగించేలా వ్యవహరిస్తే కఠిన చర్యలు ఉంటాయని సీపీ కల్మేశ్వర్ గురువారం ఒక ప్రకటనలో హెచ్చరించారు. జిల్లాలో విగ్రహాల ఏర్పాటుకు కలెక్టర్ ఆధ్వర్యంలోని కమిటీ అనుమతులు తీసుకోవాలని, రద్దీ ప్రాంతాలు, ప్రభుత్వ భవనాల్లో విగ్రహాలు ఏర్పాటు చేయొద్దని స్పష్టం చేశారు. డీజేల వినియోగానికి పోలీసుల అనుమతి తప్పని సరని, నివాస, వ్యాపార స్థలాల్లో రాత్రివేళ 55 డెసిబెల్స్‌లోపు శబ్దం వచ్చే ఉపకరణాలు మాత్రమే వాడాలన్నారు. రాత్రి 10 నుంచి ఉదయం 6 వరకు డీజేలు పూర్తిగా నిషేధమన్నారు.

సామర్థ్యానికి మించి ఉత్పత్తి

పోచంపాడ్(బాల్కొండ), న్యూస్‌టుడే: శ్రీరామసాగర్ ప్రాజెక్టు జల విద్యుత్తు ఉత్పాదన కేంద్రంలో గురువారం విద్యుత్తు ఉత్పత్తి సామర్థ్యానికి మించి జరిగిందని జెన్‌కో డీఈఈ శ్రీనివాస్ తెలిపారు. నాలుగు టర్బయిన్లతో ఒక్కో దాని నుంచి 9 మెగావాట్లు ఉత్పత్తి చేసే సామర్థ్యం ఉంది. 1 నుంచి 4 టర్బయిన్ల ద్వారా వరుసగా 9.12, 9.11, 9.16, 9.05 మెగావాట్ల చొప్పున మొత్తం 36.44 మెగావాట్ల విద్యుత్తు ఉత్పత్తి జరుగుతోందన్నారు. 2024-25 సంవత్సరానికి ఇప్పటి వరకు 33.2017 మిలియన్ యూనిట్ల విద్యుత్తు ఉత్పత్తి జరిగింది.



మూడు వరద గేట్ల ఎత్తివేత

శ్రీరామసాగర్, న్యూస్‌టుడే: శ్రీరామసాగర్ జలాశయంలోకి ఎగువ నుంచి 18,826 క్యూసెక్కుల వరద చేరుతోంది. ప్రాజెక్టులో పూర్తిస్థాయిలో 1091 అడుగుల(80.5 టీఎంసీలు) వరకు నీటి నిల్వ ఉంది. గురువారం 9372 క్యూసెక్కులను మూడు గేట్ల ద్వారా గోదావరి నదిలోకి వదులుతున్నారు. కాకతీయ కాల్వ ద్వారా 5800, ఎస్కేప్ గేట్ల ద్వారా 2200, లక్ష్మి కాల్వకు150, సరస్వతికి 500, మిషన్ భగీరథకు 231 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు.

ఎల్ఆర్ఎస్ వేగవంతానికి కసరత్తు

క్షేత్రస్థాయి తనిఖీలకు వార్డు అధికారుల నియామకం

ఈనాడు, నిజామాబాద్

లేఅవుట్ క్రమబద్ధీకరణ పథకం (ఎల్ఆర్ఎస్) దరఖాస్తుల పరిశీలనలో వేగం పెరగనుంది. నగరపాలక సంస్థ పరిధిలో 33,814 అర్జీలున్నాయి. వీటిని క్షేత్రస్థాయిలో తనిఖీ చేసి హద్దులు గుర్తించడం ఇప్పటి వరకు పట్టణ ప్రణాళిక విభాగం చేపట్టింది. కానీ, ఈ విభాగంలో 19 మంది సిబ్బందికి నలుగురే ఉన్నారు. వీరు ఇన్ని వేల దరఖాస్తులు చూడటం సాధ్యమయ్యేలా లేదని అధికారులు ఉన్నతస్థాయికి నివేదించారు. ప్రక్రియ వేగవంతం చేసేందుకు వీలుగా వార్డు అధికారులను నియమించుకునేందుకు అనుమతులొచ్చాయి. ఇకపై డివిజన్ల వారీగా ఉద్యోగులకు బాధ్యతలు అప్పగించి దరఖాస్తుల పరిశీలనకు కార్యాచరణ అమలు చేయనున్నారు.

ఇప్పటి వరకు మూడు బృందాలతో..

ఎల్ఆర్ఎస్ దరఖాస్తులు నగరపాలక సంస్థ పరిధిలో పట్టణ ప్రణాళిక విభాగం అధికారుల లాగిన్‌లో ఉంటాయి. ఎల్ఆర్ఎస్-2020 యాప్ ద్వారా వీరు తొలిదశలో క్షేత్రస్థాయికి వెళ్లి తనిఖీ చేయాల్సి ఉంటుంది. రెండు, మూడు దశల్లో అధికారుల పరిశీలన కార్యాలయాల్లోనే సాగుతుంది. వేలల్లో దరఖాస్తులు ఉండటం.. పైగా అర్జీ పెట్టుకున్న వారి చిరునామాలు గుర్తించటం, స్థలాల హద్దులు నిర్ధారించడంలో ఇబ్బందులు తలెత్తున్నాయి. ఈ క్రమంలో పరిశీలన ప్రక్రియ నత్తనడకన సాగుతోంది. కేవలం మూడు బృందాలు అరవై డివిజన్లలో పనిచేస్తుండటంతో గుట్టలుగా ఉన్న దరఖాస్తులు ఎప్పుడు పూర్తవుతాయో తెలియని పరిస్థితి. ఈ నేపథ్యంలో వార్డు అధికారులను నియమించుకొని ప్రక్రియ వేగవంతం చేయాలని పురపాలకశాఖ ఆదేశించింది.



ఇకపై ఇలా..

వార్డు అధికారులతో ఎల్ఆర్ఎస్ అర్జీలు తనిఖీ చేయించనున్నారు. ఇందుకోసం నగరపాలక సంస్థలోని అన్ని విభాగాల ఉద్యోగులు ఈ ప్రక్రియలో భాగం చేయనున్నారు. ఒక్కొక్కరికి ఒక్కో డివిజన్ బాధ్యత అప్పగించి.. ఆ ప్రాంతం నుంచి వచ్చిన దరఖాస్తుల పరిశీలన పూర్తి చేయించనున్నారు. ఇప్పటికే 27 డివిజన్లకు వార్డు అధికారుల నియామకంపై స్పష్టత వచ్చింది. పట్టణ పేదరిక నిర్మూలన, మున్సిపల్ వైద్యారోగ్య విభాగాల సిబ్బందిని ఈ క్రతువులో భాగస్వాములు చేయనున్నారు. తద్వారా తనిఖీ బృందాలు పెరిగి.. నిర్దేశిత లక్ష్యం పూర్తి చేసే అవకాశం ఉంటుందని అధికారులు చెబుతున్నారు.

రానున్న రోజుల్లో ఇతర పనులకు..

నగరపాలక సంస్థలో అన్ని విభాగాల్లో ఉద్యోగుల కొరత ఉంది. దీంతో లక్ష్యాలు చేరుకోలేకపోతున్నారు. ఎల్ఆర్ఎస్ అర్జీల పరిశీలన విధుల మాదిరిగానే ఇతర కార్యక్రమాల్లోనూ వార్డు అధికారులను భాగస్వామ్యం చేయాలనే ఆలోచన మున్సిపల్ కమిషనర్ చేశారు. ఇప్పటికే ఆస్తి పన్ను మదింపు, నీటి కనెక్షన్ల సర్వే కొన్ని డివిజన్లలో చేపడుతున్నారు. ఆస్తిపన్ను మదింపులో అక్రమాలు, లోపాలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉంది. పొరపాట్లను సవరించి, నిబంధనల మేరకు పన్ను విధించటంతో ఆదాయం పెరగనుంది. పైగా ఆక్రమణల కట్టడి, నిర్మాణాల్లో ఉల్లంఘనలను ప్రారంభ దశలోనే గుర్తించి నిలిపివేసే కార్యాచరణ అమలు చేయాలని భావిస్తున్నారు.

విద్యుత్తు సరఫరాలో అంతరాయం రేపు

నిజామాబాద్ అర్బన్, న్యూస్‌టుడే: విద్యుత్తు మరమ్మతుల కారణంగా శనివారం నగరంలో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్తు సరఫరాలో అంతరాయం ఉంటుందని ఆ శాఖ నగర ఏడీఈలు చంద్రశేఖర్, ప్రసాద్‌రెడ్డి, వీరేశం ఒక ప్రకటనలో తెలిపారు. పవర్ హౌస్, తిలక్ గార్డెన్, దుబ్బ, మిర్చి కంపౌండ్, వినాయక్‌నగర్, అర్సపల్లి, న్యూ హౌసింగ్ బోర్డు కాలనీ, గూపన్‌పల్లి ఉప కేంద్రం పరిధిలో అంతరాయం ఉంటుందని వినియోగదారులు సహకరించాలన్నారు.

లారీలు వీడి.. బోధనకు కదిలి | కామారెడ్డికి కేంద్ర ఔషధ గిడ్డంగి | 6వ పేజీలో

పండగ ఆదాయం రూ.1.69 కోట్లు

17 వరకు కొనసాగిన 586 ప్రత్యేక బస్సులు

న్యూస్‌టుడే, నిజామాబాద్ నగరం

బతుకమ్మ, దసరా పండుగల సందర్భంగా ప్రత్యేక బస్సులు నడిపించడంతో ఆర్టీసీకి భారీగా ఆదాయం సమకూరింది. ఈ నెల 1 నుంచి 17వ తేదీ వరకు ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేశారు. నిజామాబాద్ 1, 2, ఆర్మూర్, బోధన్, కామారెడ్డి, బాన్సువాడ డిపోల నుంచి 586 బస్సులు నడిపారు. పండగల సందర్భంగా సంస్థకు రూ. 1,69,08,445 కోట్ల ఆదాయం వచ్చిందని ఆర్టీసీ ఆర్ఎం జానిరెడ్డి తెలిపారు.

సిబ్బంది పర్యవేక్షణలో..

పండగ సందర్భంగా జేబీఎస్ నుంచి జిల్లాకు రద్దీ కొనసాగింది. అక్కడ జిల్లా నుంచి ప్రత్యేక సిబ్బందిని ఉంచి పర్యవేక్షించారు. పండగ అనంతరం నిజామాబాద్ నుంచి జేబీఎస్‌కు రద్దీ పెరగడంతో ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేసి అధికారుల పర్యవేక్షణలో ప్రయాణికులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా నడిపించారు.



గమ్యస్థానాలకు వెళ్లేందుకు ప్రయాణికుల రద్దీ

డిపోల వారీగా వివరాలు

డిపో	బస్సులు	కిలోమీటర్లు	ఆదాయం (రూ॥)
ఆర్మూర్	140	49,448	37,46,215
బోధన్	77	31,100	23,44,550
నిజామాబాద్-1	109	43,410	35,45,801
నిజామాబాద్-2	98	37,656	24,84,230
బాన్సువాడ	81	30,985	22,23,195
కామారెడ్డి	81	32,500	25,64,454
మొత్తం	586	2,25,099	1,69,08,445


లాఠీలు వీడి.. బోధనకు కదిలి

ఉన్నతంగా తీర్చిదిద్దుతా

● మాసరి వినోద్‌కుమార్ ❖ మంథని, ఆర్మూర్ ◆ 550 ✻ 62.77 ➾ ఎస్జీటీ

☛ భవిష్యత్తు తరాలను తీర్చిదిద్దే వృత్తిలో చేరాలనే లక్ష్యంతో గత ఏడాదిగా కష్టపడుతున్నాను. 2018లో కానిస్టేబుల్‌గా ఎంపికయ్యాను. వీలు చిక్కినప్పుడల్లా సెలవులు తీసుకొని చదివా. అమ్మ లక్ష్మి నా వెన్నంటి ప్రోత్సహించారు. - న్యూస్‌టుడే, ఇందూరు సిటీ





☛ ఉపాధ్యాయ కొలువులు కొట్టిన కానిస్టేబుళ్లు

డీఎడ్, బీఎడ్, బీపీఎడ్ చేసినా సమయానికి డీఎస్సీలు పడక సమయం వృథా అయింది. ఆర్థిక పరిస్థితి అంతంత మాత్రంగా ఉన్న కుటుంబాలకు అండగా నిలిచేందుకు కానిస్టేబుల్ కొలువులు కొట్టి లాఠీలు పట్టారు. పోలీసు శాఖలో తీరికలేకుండా విధులు నిర్వర్తిస్తూనే తమకిష్టమైన బోధన వృత్తిపై మమకారం మరువలేదు. బాధ్యతలు సమన్వయం చేసుకుంటూనే వీలు చేసుకొని డీఎస్సీకి సిద్ధమయ్యారు. తాజా ఫలితాల్లో ఏడుగురు ఉపాధ్యాయులయ్యారు. నిజామాబాద్ సీపీ కల్మేశ్వర్ వారిని అభినందించి.. ఈ నిబద్ధతే బోధనలోనూ చూపి విద్యార్థులను ఉత్తములుగా తీర్చిదిద్దాలని సూచించారు.

● పేరు ❖ ఊరు, మండలం ◆ సాధించిన ర్యాంకు ✻ పొందిన మార్కులు ➾ పోస్టు కేటగిరీ ☛ ఎన్నేళ్లు కష్టపడ్డారు

ఉత్తమ క్రీడాకారులుగా మారుస్తా

● నవీన్ కన్యకాయల ❖ యానంపల్లి, డిచ్‌పల్లి ◆ 3 ✻ 63 ➾ పీఈటీ

☛ రెండేళ్లుగా సిద్ధమవుతున్నాను. ఇందు కోసం ఎలాంటి శిక్షణ లేకుండా సొంతంగానే చదివా. 2018లో కానిస్టేబుల్ ఉద్యోగం వచ్చింది. వ్యాయామ ఉపాధ్యాయుడిగా స్థిరపడాలని అనుకున్నాను. తల్లిదండ్రులు సావిత్రి, గంగారాం ఎన్నో కష్టాలు పడ్డారు. నా విద్యార్థులను ఉత్తమ క్రీడాకారులుగా మారుస్తా. - నిజామాబాద్ క్రీడావిభాగం



అమ్మ కష్టానికి ప్రతిఫలం

● ఎం లలిత ❖ చిన్నరాజేపల్లి, నందిపేట్ ◆ 172 ✻ 70.37 ➾ ఎస్జీటీ

☛ ఆరేళ్ల నుంచి ఉపాధ్యాయ కొలువు కోసం చదువుతున్నాను. అమ్మ గంగామణి బీడీలు చుడుతూ నన్ను చదివించారు. నాలుగేళ్ల కిందట సివిల్ కానిస్టేబుల్‌గా ఎంపికయ్యాను. కుటుంబానికి అండగా ఉండాలని ఆ ఉద్యోగం చేస్తూనే నాకిష్టమైన బోధన వృత్తిలోకి రావాలని కష్టపడ్డాను. పోలీసు శాఖలో సెలవులు దొరకవు. ఒకవైపు విధులు నిర్వర్తిస్తూనే డీఎస్సీ కోసం సమయం దొరికినప్పుడల్లా చదివాను. అమ్మ పడిన కష్టానికి ప్రతిఫలం దక్కింది. మొదటి పోస్టింగ్ రెంజల్ మండలం కందకుర్తి ప్రాథమిక పాఠశాలలో వచ్చింది. విద్యార్థులను ఉన్నతులుగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తా. - న్యూస్‌టుడే, ఇందూరు సిటీ



ఎనిమిదేళ్ల శ్రమ



● కొంద నాగేంద్రబాబు ❖ ఇస్సాపల్లి ఆర్మూర్ ◆ 14 ✻ 79.53 ➾ ఎస్జీటీ

☛ 2015లో డీఎడ్ పూర్తయిన నుంచి డీఎస్సీ కోసం సన్నద్ధమవుతున్నాను. 2017 డీఎస్సీలో 0.2 మార్కుల తేడాతో ఉద్యోగావకాశం కోల్పోయా. నాకు ఉపాధ్యాయ వృత్తి అంటే ఎనలేని ప్రేమ. బంధువులు, తెలిసిన వారు ఇప్పట్లో డీఎస్సీ వేయరు ఏదైనా ఉద్యోగం చేసుకోవాలనేవారు. వారి ఒత్తిడి నుంచి బయట పడేందుకు 2020లో సివిల్ కానిస్టేబుల్ ఉద్యోగం సాధించాను. అటు విధులు నిర్వహిస్తూనే దొరికిన కొద్దిపాటి సమయంలో నాకిష్టమైన బోధన రంగంలోకి రావాలని చదివా. ఈ సారి జిల్లాలో ఎస్జీటీ విభాగంలో 14వ ర్యాంకు రావడంతో కలసాకారమైంది. - న్యూస్‌టుడే, నిజామాబాద్ నేరవిభాగం

నా జీవితంలో ప్రత్యేకమైన రోజు



● దండు మహేశ్ ❖ అర్సపల్లి, నిజామాబాద్ ◆ 4 ✻ 79.80 ➾ గణితం, స్కూల్ అసిస్టెంటు

☛ రెండేళ్ల నుంచి లక్ష్యం కోసం కసిగా చదువుతున్నాను. గత ప్రభుత్వ హయాంలో కానిస్టేబుల్ ఉద్యోగం వరించినా ఆ విధులు నిర్వర్తిస్తూనే డీఎస్సీ కోసం ప్రత్యేకంగా సమయం కేటాయించా. పోలీసు శాఖలో విధులు సమన్వయం చేసుకొని చదవడం కొంచెం కష్టమైంది. అయినా నాకు నచ్చిన వృత్తి కావడంతో కఠోరంగా శ్రమించాను. విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించేందుకు కృషిచేస్తా. నవీపేట మండలం ఫకీరాబాద్ జడ్పీహెచ్‌ఎస్‌లో గణిత ఉపాధ్యాయుడిగా చేరిన రోజు నాకెంతో ప్రత్యేకం. - న్యూస్‌టుడే, నిజామాబాద్ నేరవిభాగం

ఆటుపోట్లు తట్టుకొని..

● కదారి నాగరాజు ❖ సుంకెట్, మోర్తాడ్ ◆ 239 ✻ 69 ➾ ఎస్జీటీ



☛ 2017 నుంచి డీఎస్సీకి సిద్ధమవుతున్నా. 2018లో కానిస్టేబుల్ ఉద్యోగం వచ్చింది. ఆరేళ్లుగా ఆ విధుల్లో తీరికలేకుండా గడిపాను. మధ్యలో ఆటుపోట్లు వచ్చినా తట్టుకుని లక్ష్య సాధనలో ముందుకు సాగా. అమ్మానాన్న లక్ష్మి, ఐక్కన్న ప్రోత్సాహంతో డీఎస్సీ సాధించా. ఏర్గట్ల మండలం దొంచంద ప్రాథమిక పాఠశాలలో చేరా. విద్యార్థులకు నాణ్యమైన ప్రాథమిక విద్య అందిస్తా. - న్యూస్‌టుడే, ఇందూరు సిటీ

12 ఏళ్లుగా..

● హరీశ్ పెగడ ❖ శెట్‌పల్లి, మోర్తాడ్ ◆ 4 ✻ 63.5 ➾ పీఈటీ



☛ 2012లోనే కానిస్టేబుల్ ఉద్యోగం వరించింది. పోలీసు శాఖలో కొత్తగా వచ్చిన వారికి శిక్షణ ఇస్తుంటా. ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు శిక్షకుడిగా పనిచేయాలని నిర్ణయించుకున్నా. 12 ఏళ్లుగా కష్టపడుతూనే ఉన్నా. 2017 డీఎస్సీలో స్వల్ప తేడాతో ఉద్యోగం చేజార్చుకున్నా. అప్పటి నుంచి మరింత కసిగా చదివి పీఈటీగా ఎంపికయ్యా. రెంజర్ల జడ్పీహెచ్‌ఎస్‌లో వ్యాయామ ఉపాధ్యాయుడిగా చేరా. - న్యూస్‌టుడే, నిజామాబాద్ క్రీడావిభాగం



ఎంపికైన క్రీడాకారులతో ఉపాధ్యాయులు, నిర్వాహకులు

చదరంగంలో రాష్ట్రస్థాయికి ఎంపిక

కామారెడ్డి క్రీడావిభాగం, న్యూస్‌టుడే: ఎస్జీఎఫ్ ఉమ్మడి జిల్లా స్థాయి చదరంగం పోటీలు దేవునిపల్లి ఉన్నత పాఠశాలలో గురువారం నిర్వహించారు. అండర్-17 బాలుర విభాగంలో రవివర్మ(బోధన్ గురుకులం), శ్రీహర్ష (ఎల్లారెడ్డి గురుకులం), రూపేంద్ర (ఎస్ఎస్ఆర్ నిజామాబాద్), సౌరాజ్(పెర్కిట్ ఆదర్శ పాఠశాల), గణేశ్(బిచ్కుంద) రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. అండర్-17 బాలికల విభాగంలో హర్షిత(కాకతీయ, నిజామాబాద్), శ్రీనిత(ఎస్పీఆర్, కామారెడ్డి), స్నేహిత(ఎస్పీఆర్, కామారెడ్డి), రోషిని (అభ్యాస, నిజామాబాద్), పల్లవి(నిజామాబాద్ గురుకులం) ఎంపికైనట్లు ఎస్జీఎఫ్ కార్యదర్శి హీరాలాల్ తెలిపారు. అండర్-14 బాలికల విభాగంలో రిషిత, మనోజ్ఞ, నాగ జాషనిక, శరద్రుతి, చిన్మయిలు, బాలుర విభాగంలో.. శివకుమార్, సాయి దీక్షిత్, జోసెఫ్, ధనుష్, సుశాల్‌లు ఎంపికయ్యారు. కార్యక్రమంలో డీఈవో రాజు, హెచ్ఎం గంగాకిషన్, స్వామిగౌడ్, ప్రభులింగం, లక్ష్మణ్, రామకృష్ణ, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.



టేబుల్ టెన్నిస్‌లో..

కామారెడ్డి క్రీడావిభాగం : కామారెడ్డి సీనియర్ సిటిజెన్ ఫోరం కార్యాలయంలో ఎస్జీఎఫ్ ఉమ్మడి జిల్లా టేబుల్ టెన్నిస్ క్రీడలను గురువారం నిర్వహించారు. అండర్-17 బాలుర విభాగంలో నౌషద్, భవానీ ప్రసాద్, అహ్మద్ (కాకతీయ, నిజామాబాద్), వర్ధన్ (అభ్యాస, నిజామాబాద్), రోనాల్డ్ (జీజేసి, మాక్లూర్)లు టాప్‌లో నిలిచి రాష్ట్రస్థాయికి ఎంపికయ్యారు. బాలికల విభాగంలో హరిణి, అక్షర, శ్రీగౌరి (కాకతీయ, నిజామాబాద్), రితిక (ఎంజేపీటీ, నిజామాబాద్), విశ్వజ (ఎంజేపీటీ, నిజామాబాద్) ఎంపికైనట్లు నిర్వాహకులు వెల్లడించారు. అండర్-14 బాలుర విభాగంలో నిల్సన్, రాథోడ్, సంజయ్, అంద్రి, అక్షిత్‌సాయి, పవన్, బాలికల విభాగంలో.. జాహ్నవి, రితిక, అశ్రిత, అఫియా, ఫాతిమా, మనుశ్రీలు తొలి 5 స్థానాల్లో నిలిచి రాష్ట్రస్థాయికి ఎంపికయ్యారు. కార్యక్రమంలో ఎస్జీఎఫ్ కార్యదర్శి హీరాలాల్, స్వామిగౌడ్, సంతోష్, నాగరాజు, రఘురాం, రాజు, శ్రీధర్, అరుణ, విజయభారతి తదితరులు పాల్గొన్నారు.



రాష్ట్రస్థాయికి ఎంపికైన టేబుల్ టెన్నిస్ క్రీడాకారులు

కామారెడ్డికి కేంద్ర ఔషధ గిడ్డంగి

న్యూస్‌టుడే, కామారెడ్డి వైద్యవిభాగం

కామారెడ్డి జిల్లాకు కేంద్ర ఔషధ గిడ్డంగి(సీడీఎస్) మంజూరైంది. జాతీయ వైద్య మిషన్ పథకంలో భాగంగా దీని ఏర్పాటుకు చర్యలు చేపట్టారు. కామారెడ్డి బోధనాసుపత్రిలో కేంద్రం ఏర్పాటుకు స్థలం అనువుగా లేకపోవడంతో వైద్యకళాశాలలో మూడు గదులను కేటాయించారు. అక్కడ గిడ్డంగిని ఏర్పాటుచేశారు. ఈ కేంద్రానికి పూర్తిస్థాయిలో ఔషధాలు అందుబాటులోకి వస్తే రోగుల వెతలు తీరనున్నాయి. కామారెడ్డి కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ చొరవతో కేంద్రం నెలకొల్పడానికి అడుగులు పడ్డాయి.

నివేదిక ఆధారంగా సరఫరా

జీజీహెచ్ ఆసుపత్రికి అనుబంధంగా ఏర్పాటుచేసే కేంద్ర ఔషధ గిడ్డంగికి అవసరమైన ఔషధాలు హైదరాబాద్ సీడీఎస్ నుంచి వస్తాయి. ఇక్కడికి చేరిన మందులను జిల్లాలోని వివిధ స్థాయి ఆసుపత్రులకు సరఫరా చేస్తారు. ఏ ఆసుపత్రులకు ఏయే మందులు అవసరం ఉన్నాయో కేంద్ర బాధ్యుడికి నివేదిక పంపుతారు. దాని ఆధారంగా సీడీఎస్ నుంచి నేరుగా ఆయా వైద్యాలయాలకు వెళతాయి. జిల్లాకేంద్రంలో కేంద్రం అందుబాటులో ఉండటంతో సేవలు మరింత సులభతరం కానున్నాయి.



నూతన కేంద్రంలో ఔషధాల నిల్వ

పక్కా భవనం ఏర్పాటు అవసరం

తాత్కాలికంగా వైద్యకళాశాలలో ఔషధ కేంద్రం ఏర్పాటుచేసినా భవిష్యత్తులో పక్కా భవనం ఏర్పాటు అవసరమని అధికారులు చెబుతున్నారు. ప్రస్తుతం ఇచ్చిన మూడు భవనాలు సరిపోవు. గిడ్డంగి మాదిరిగా నిర్మాణాలు చేసి కేంద్రాన్ని విస్తరిస్తే వీలైనన్ని ఔషధాల సరఫరాకు ఆస్కారం ఉంది. కేంద్ర ఏర్పాటుతో నిజామాబాద్‌కు వెళ్లాల్సిన అవసరం ఉండదని డీఎంహెచ్‌వో చంద్రశేఖర్ వెల్లడించారు. పీహెచ్‌సీలకు ఇక్కడి నుంచే నేరుగా మందులు సరఫరా అవుతాయన్నారు.

ఇదివరకు ఉమ్మడి జిల్లాకు ఒక్కటే..

ఉమ్మడి నిజామాబాద్ జిల్లాకు కేంద్ర ఔషధ కేంద్రం 14 ఏళ్ల క్రితం మంజూరైంది. అక్కడి నుంచే ఉమ్మడి జిల్లాలోని వివిధ ఆరోగ్యకేంద్రాలకు ఔషధాలు సరఫరా చేస్తున్నారు. కామారెడ్డి, నిజామాబాద్ జిల్లాలో ఒకే కేంద్రం ఉండటంతో రోగులకు ఇబ్బందులు తలెత్తేవి. సరైన ఔషధాలు లేక రోగులు ప్రైవేటుగా మందులను కొనుగోలు చేశారు. అరకొర ఔషధాలతో ప్రభుత్వ వైద్యశాలను నిర్వహిస్తున్నారనే ఆరోపణలున్నాయి.

19న వాలీబాల్ పోటీలు

నిజామాబాద్ క్రీడావిభాగం, న్యూస్‌టుడే: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో డీఎస్ఏ మైదానంలో ఈ నెల 19న ఉదయం 10 గంటలకు ఉమ్మడి నిజామాబాద్ జిల్లా వాలీబాల్ పోటీలు ఉంటాయని ఎస్జీఎఫ్ కార్యదర్శి నాగమణి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. అండర్-17 బాలబాలికల విభాగాల్లో ఎంపిక ఉంటాయని, ఆటగాళ్లు బోనాఫైడ్‌తో రావాలన్నారు. 2008 జనవరి 1, ఆ తర్వాత పుట్టిన వారు అర్హులని పేర్కొన్నారు.

ఉషూలోనూ..

నిజామాబాద్ క్రీడావిభాగం, న్యూస్‌టుడే : స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో డీఎస్ఏ మైదానంలో ఈ నెల 19న మధ్యాహ్నం 3 గంటలకు ఉమ్మడి నిజామాబాద్ జిల్లా ఉషూ క్రీడాకారుల ఎంపికలు ఉంటాయని ఎస్జీఎఫ్ కార్యదర్శి నాగమణి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. అండర్-17 బాలబాలికల విభాగాల్లో పాల్గొనే క్రీడాకారులు బోనాఫైడ్ వెంట తెచ్చుకోవాలన్నారు. 2008 జనవరి 1, ఆ తర్వాత పుట్టిన వారు అర్హులని పేర్కొన్నారు.

చదువుతో పాటు క్రీడలకు ప్రాధాన్యమివ్వాలి

నందిపేట్, న్యూస్‌టుడే: విద్యార్థులు చదువుతో పాటు క్రీడలకు ప్రాధాన్యమివ్వాలని మండల విద్యాశాఖాధికారి గంగాధర్ అన్నారు. మండల కేంద్రంలోని గీత కాన్వెంట్ పాఠశాలలో గురువారం జిల్లాస్థాయి బాల, బాలికల ఖోఖో టోర్నమెంటు నిర్వహించారు. క్రీడాకారుల మార్చ్‌ఫాస్ట్ అనంతరం క్రీడలు ప్రారంభించారు. 14 బాలుర, 10 బాలికల జట్లు పాల్గొన్నాయి. నాకౌట్ పద్ధతిలో జరిగిన టోర్నీలో బాలుర విభాగంలో విజేతగా వర్ని ప్రభుత్వ ఉన్నత పాఠశాల, ద్వితీయ స్థానంలో కంజర, బాలికల విభాగంలో విజేతగా కల్దుర్కి, ద్వితీయస్థానంలో మామిడిపల్లి జట్లు నిలిచాయి. వీరికి అసోసియేషన్ ప్రతినిధులు బహుమతులు ప్రదానం చేసి అభినందించారు. కార్యక్రమంలో గంగాసాగర్, నిత్యానందం, భూమారెడ్డి, అతిఖుల్లా, కిషన్, మధుసూదన్‌రెడ్డి పాల్గొన్నారు.



ట్రోఫీ అందజేస్తున్న పీడీలు, అధికారులు



నల్ల బ్యాడ్జీలతో నిరసన తెలుపుతున్న అధ్యాపకులు

పదోన్నతులు కల్పించాలని డిమాండ్

తెవివి క్యాంపస్, న్యూస్‌టుడే: హైకోర్టు ఉత్తర్వులను అమలు చేయాలని తెలంగాణ విశ్వవిద్యాలయంలో 2014 ఏడాదిలో నియామకమైన అధ్యాపకులు గురువారం వర్సిటీ పరిపాలన భవనం ఎదుట నల్ల బ్యాడ్జీలతో నిరసన తెలిపారు. హైకోర్టు ఉత్తర్వుల ప్రకారం పదోన్నతులు కల్పించాలని టూటా అధ్యక్షుడు పున్నయ్య డిమాండ్ చేశారు. పదోన్నతులు కల్పించాలని అడ్వకేట్ జనరల్ వర్సిటీకి తన నివేదిక ద్వారా తెలిపినప్పటికీ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో పలువురు అధ్యాపకులు హైకోర్టును సంప్రదించారని టూటా కోశాధికారి నాగరాజు పేర్కొన్నారు. అనంతరం రిజిస్ట్రార్ ఆచార్య యాదగిరికి వినతిపత్రం ఇచ్చారు. టూటా అసోసియేషన్ ఉపాధ్యక్షుడు సత్యనారాయణరెడ్డి, రాజేశ్వరి, కార్యదర్శులు బాలకిషన్, నీలిమా, ప్రతినిధులు చంద్రశేఖర్, ప్రసన్నశీల, జమీల్, స్వప్న, స్రవంతి, మహేందర్ తదితరులు పాల్గొన్నారు.

21న ధ్రువపత్రాల పరిశీలన

నిజామాబాద్ విద్యావిభాగం, న్యూస్‌టుడే: డీఈఈసెట్-2024 పరీక్షలో ఉత్తీర్ణత సాధించి డీఎల్ఎడ్, డీపీఎస్సీ కోర్సుల్లో ప్రవేశానికి గతంలో హాజరుకాని అభ్యర్థులకు ఈ నెల 21న నాగారంలోని ప్రభుత్వ డైట్ కళాశాలలో ధ్రువపత్రాల పరిశీలన నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపల్ టి.శ్రీనివాస్ గురువారం ప్రకటనలో తెలిపారు. పరిశీలన పూర్తయినవారు 23-26 తేదీల్లో వెబ్ ఆప్షన్లు నమోదు చేసుకోవాలని, అనంతరం సీటు పొందినవారు ఈ నెల 30 నుంచి నవంబర్ 3 వరకు కళాశాలల్లో తమ నిజధ్రువపత్రాలతో చేరాలని సూచించారు.

జిల్లాకు గుర్తింపు తీసుకురావాలి

నిజామాబాద్ విద్యావిభాగం, న్యూస్‌టుడే: జిల్లా స్థాయిలో గెలుపొందిన విద్యార్థులు రాష్ట్ర, జాతీయ స్థాయిల్లో ప్రతిభ చాటి జిల్లాకు గుర్తింపు తీసుకురావాలని డీఈవో దుర్గాప్రసాద్ ఆకాంక్షించారు. నగరంలోని బాల్‌భవన్‌లో ఏఎంవో జీవన్ అధ్యక్షతన కొనసాగిన జిల్లా స్థాయి కళోత్సవ్ పోటీల ముగింపు కార్యక్రమానికి గురువారం ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. విద్యార్థి దశలోనే తమలోని కళను ప్రదర్శించుకోవడానికి చక్కని వేదికగా కళోత్సవ్ నిలుస్తుందన్నారు. రెండో రోజు ఆరు విభాగాల్లో పోటీలు నిర్వహించి, విజేతలుగా నిలిచిన వారిని రాష్ట్రస్థాయికి ఎంపిక చేశారు. బాల్‌భవన్ పర్యవేక్షణాధికారి ప్రభాకర్, గైడ్ టీచర్లు, న్యాయనిర్ణేతలు పాల్గొన్నారు.

జిల్లా స్థాయి విజేతలు వీరే: వాద్య సంగీతంలో అమిత్‌రాజ్ (విజయ్‌సాయి, బోధన్), వర్ధన్ (జడ్పీహెచ్ఎస్, కంజర) తొలి రెండు స్థానాల్లో గెలుపొందారు. గాత్ర సంగీతంలో పి.అక్షయ్ (టీజీఆర్ఎస్, కంజర) ప్రథమ, మనస్విని, గాయత్రి, నాగదీక్ష, మహతి (విజయ్ ఉన్నత పాఠశాల) ద్వితీయ స్థానాల్లో నిలిచారు. దృశ్య కళల్లో భవ్యశ్రీ (జడ్పీహెచ్ఎస్, బోర్గాం(పి)), త్రినాథ్ (జడ్పీహెచ్ఎస్, మల్కాపూర్) వరుస స్థానాల్లో నిలిచారు. కథలు చెప్పడంలో కె.రూప (జడ్పీహెచ్ఎస్, నవీపేట్) ప్రథమ, అభినయ (టీజీఆర్ఎస్, ఎడపల్లి), ద్వితీయ స్థానాలు సాధించారు. రంగస్థల కళల్లో బి.సంధ్య, మాధుర్య, మహేష్, మధుశ్రీ (జీహెచ్ఎస్, కసాబ్‌గల్లి), సుప్రియ, మాధురి, పూజ, దివ్య (టీజీఆర్ఎస్, ఎడపల్లి) వరుస స్థానాల్లో నిలిచారు. నృత్యంలో లాస్య, సుమిశా, మధుప్రియ, దివ్య, భవ్య (జడ్పీహెచ్ఎస్, బోర్గాం) మొదటి, శ్రీష్మ(నారాయణ పాఠశాల, నిజామాబాద్) రెండవ స్థానాల్లో నిలిచారు.



సాంప్రదాయ నృత్యం చేస్తున్న విద్యార్థినులు



మాట్లాడుతున్న డీఈవో దుర్గాప్రసాద్

నాటుసారా తయారీ కేంద్రాలపై దాడి

భీమ్‌గల్, న్యూస్‌టుడే: భీమ్‌గల్, సిరికొండ మండలాల్లోని నాటుసారా తయారీ విక్రయ కేంద్రాలపై జిల్లా టాస్క్‌ఫోర్స్, ఆబ్కారీశాఖ ఎన్‌ఫోర్స్‌మెంటు అధికారులు సంయుక్తంగా దాడులు చేసినట్లు ఆబ్కారీ సీఐ వేణుమాధవరావు తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. సిరికొండ మండలం చీమన్‌పల్లి, పందిమడుగు, దుప్యతండా, జనిగలతండాల్లో 20 లీటర్ల నాటుసారా స్వాధీనం చేసుకుని ఆరుగురు విక్రయదారులపై కేసులు నమోదుచేసినట్లు తెలిపారు. భీమ్‌గల్ మండలం బెజ్జోర రోడ్డులో 10 లీటర్ల నాటుసారా తరలిస్తున్న వ్యక్తిని పట్టుకుని కేసు నమోదు చేశామన్నారు. దాడుల్లో ఎన్‌ఫోర్స్‌మెంట్ ఏఈఎస్ డీసీబీ నాయక్, ఎన్‌ఫోర్స్‌మెంట్ సీఐ పి.స్వప్న, టాస్క్‌ఫోర్స్ సీఐ విలాస్, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రైవేటు కళాశాలల బంద్ విరమణ

తెవివి క్యాంపస్, న్యూస్‌టుడే: పెండింగ్‌లోని ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలని చేపట్టిన నిరవధిక ప్రైవేటు డిగ్రీ, పీజీ కళాశాలల బంద్‌ను విరమించినట్లు అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు అంబోజి హరిప్రసాద్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉపముఖ్యమంత్రి బట్టి విక్రమార్క, ప్రభుత్వ ప్రిన్సిపల్ కార్యదర్శి బుర్రా వెంకటేశం ఇచ్చిన హామీ మేరకు బంద్‌ను విరమించామని, శుక్రవారం నుంచి కళాశాలలు పునఃప్రారంభమవుతాయన్నారు. ప్రభుత్వంతో చర్చలకు సహకరించిన బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య, టీపీడీపీఎంఏ రాష్ట్ర అధ్యక్షుడు సూర్య నారాయణరెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

నిజామాబాద్

• నిజామాబాద్ అర్బన్ • నిజామాబాద్ రూరల్ • బోధన్ • బాన్సువాడ

ప్రతి పశువుకు టీకా వేయాలి

జక్రాన్‌పల్లి, నవీపేట, న్యూస్‌టుడే: పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు ఉచితంగా వేస్తున్నామని, ఈ కార్యక్రమాన్ని పాడి రైతులు సద్వినియోగం చేసుకోవాలని జేడీఏహెచ్ జగన్నాథచారి సూచించారు. గురువారం జక్రాన్‌పల్లి మండలం చింతలూర్‌లో నిర్వహించిన గాలికుంటు వ్యాధి టీకా కార్యక్రమాన్ని పర్యవేక్షించి మాట్లాడారు. ప్రతి పశువుకు టీకా వేయాలన్నారు. వెంట జనరల్ పశువైద్యాధికారి శశిరేఖ, గోపాల మిత్ర రాజేశ్వర్, సిబ్బంది ఉన్నారు. నవీపేట మండలంలోని కమలాపూర్, మహంతంలో 674 పశువులకు గాలికుంటు నివారణ టీకాలు ఇచ్చినట్లు పశువైద్యాధికారి నరేందర్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు.

ఆసుపత్రి ఎదుట ధర్నా

నిజామాబాద్ వైద్యవిభాగం, న్యూస్‌టుడే: నగరంలోని సరస్వతినగర్‌లో ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చిన్నారి మృతి చెందడంతో గురువారం ఆసుపత్రి ఎదుట కుటుంబ సభ్యులు ధర్నా నిర్వహించారు. కుటుంబ సభ్యుల వివరాల ప్రకారం.. రెంజల్ మండలానికి చెందిన నాగమణి గత నెలలో బాలుడికి జన్మనిచ్చింది. బాబు తక్కువ బరువు ఉండడంతో మైరుగైన వైద్యం కోసం ఆసుపత్రిలో చేర్పించారు. వైద్యం ఖర్చు రూ.3 లక్షలు అవుతుందని వైద్యులు చెప్పగా మొదట రూ.లక్ష చెల్లించారు. ఈలోగా చిన్నారి పరిస్థితి విషమించి మృతి చెందడంతో సదరు వైద్యులు మిగిలిన మొత్తం చెల్లిస్తే గానీ మృతదేహం ఇవ్వమని పట్టుబట్టారు. ధర్నాకు దిగడంతో వెనక్కి తగ్గి బాబు మృతదేహాన్ని అప్పగించారు.

మేమున్నాం.. మీకు తోడుగా..

94408 85670
80085 74007
98850 93048



సమస్య: దుబ్బ ప్రాంతంలో పోల్ నం. జీప 13/బీ వీధి దీపం వెలగడం లేదు. లైన్ మెన్‌కు అడిగితే దీపాలు లేవంటున్నారు. వినాయక్‌నగర్ విశాల్ మార్ట్ సందులో పోల్ నెం. డీపీఎల్1/5 వద్ద మూడు నెలలుగా ఇదే పరిస్థితి. మారుతీనగర్ రోడ్ నెం. 3 పోల్ నెం. కేఆర్ఎం/211 వద్ద కూడా వీధి దీపం వెలగడం లేదు.
– రాజు, దుబ్బ, లింగం, వినాయక్‌నగర్, గంగామోహన్, మారుతినగర్

పరిష్కారం: నగరంలో చాలాచోట్ల వీధి దీపాలు లేవు. సమస్యను కమిషనర్ దృష్టికి తీసుకెళ్తా. త్వరలోనే పరిష్కరిస్తామని చెప్పారు. **– పావని, ఏఈ**

సమస్య: జక్రాన్‌పల్లి మండలం తొర్లికొండ గ్రామంలోని ఎస్సీ వసతిగృహం పక్కన చెత్తను కుప్పగా పోసి నిప్పు పెడుతున్నారు. రహదారి వెంట వెళ్లే వాహనచోదకులు ఇబ్బంది పడుతున్నారు. **– గంగాధర్, స్థానికుడు**

పరిష్కారం: గ్రామంలోని చెత్త డంపింగ్ యార్డుకు తరలిస్తున్నాం. గుర్తుతెలియని వ్యక్తులు నిప్పుపెట్టి ఉంటే చర్యలు తీసుకుంటాం. ఇబ్బంది కలుగకుండా చర్యలు తీసుకుంటాం. **– రాజేశ్వర్, పంచాయతీ కార్యదర్శి, తొర్లికొండ**

సమస్య: వినాయక్‌నగర్ మహాలక్ష్మీనగర్‌లో కుక్కల బెడద తీవ్రమైంది. రాత్రివేళ ఇంటికి వెళ్లాలంటే భయమేస్తోంది.
– శశికాంత్, స్థానికుడు

సమాధానం: కుక్కల నివారణకు చర్యలు తీసుకుంటున్నాం. **– నటరాజ్‌గౌడ్, పారిశుద్ధ్య పర్యవేక్షకుడు, నగరపాలక సంస్థ**

– న్యూస్‌టుడే నిజామాబాద్ నగరం, నిజామాబాద్ అర్బన్, జక్రాన్‌పల్లి

గుట్టుగా తవ్వేస్తున్నారు..

• గ్రామీణ మండలంలో యథేచ్ఛగా అక్రమ మొరం దందా

న్యూస్‌టుడే, మోపాల్ (నిజామాబాద్ గ్రామీణం)

మొరంపై అక్రమార్కుల కన్ను పడి గుట్టలు తరిగిపోతున్నాయి. రాత్రివేళల్లో తవ్వకాలు చేపడుతూ రెండు చేతులా అక్రమంగా దోచుకుంటున్నారు. గ్రామీణ మండలంలోని గుండారం, మల్కాపూర్(ఎ) శివారులోని గుట్ట, మల్లారం, గాంధీనగర్ గ్రామ శివారులోని ధాత్రి టౌన్‌షిప్ వెనకాల గుట్టల నుంచి పొక్లెయినర్ల మొరం తవ్వుతూ టిప్పర్లలో నగరానికి యథేచ్ఛగా తరలిస్తున్నారు.

లేఅవుట్ల నిర్మాణాలకే అధికం..

తవ్వకాలకు ఎలాంటి అనుమతులు, వేబిల్లులు లేకుండానే అక్రమార్కులు మొరం తరలిస్తున్నారు. అటవీ ప్రాంతాల సమీప భూములను కూడా వదలడం లేదు. తవ్విన మొరాన్ని ప్రధానంగా నగరంలోని భవన నిర్మాణాలు, లే అవుట్లు, వాటిల్లో అంతర్గత రోడ్ల నిర్మాణాలకు తరలిస్తున్నారు. ఈ దందా రోజురోజుకు తీవ్రమవుతున్నా అధికారులు కట్టడి చేయలేకపోతున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు.



మల్లారం గుట్టపై తవ్వకాలు ఇలా..

పల నుంచి విమర్శలు వ్యక్తమవుతున్నాయి. కొందరు బడా నాయకుల అండదండలతోనే తవ్వకాలు జరుగుతుండడంతోనే అధికారులు అటువైపు చూడడం లేదని ఆరోపిస్తున్నారు.

కొరవడిన పర్యవేక్షణ..

గతంలో ఎక్కడ ఏం జరిగినా గ్రామస్థాయిలో వీఆర్ఏలు, వీఆర్‌వోలకు సమాచారం అందేది. వీరు అక్రమ దందాను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లడంతో తవ్వకాలకు అడ్డుకట్ట పడేది. ప్రస్తుతం వీరు లేకపోవడంతో క్షేత్రస్థాయిలో పర్యవేక్షణ కొరవడి అక్రమార్కులకు వరంగా మారింది. ప్రస్తుత తవ్వకాలు కొంతమంది అధికారుల దృష్టికి వెళ్లినా వారు పట్టించుకోకపోవడంతోనే దందా సాఫీగా సాగుతోందని విమర్శలున్నాయి. ఇప్పటికైనా ఈ దందాకు అడ్డుకట్ట వేయాలని స్థానికులు కోరుతున్నారు.

కఠిన చర్యలు తీసుకుంటాం

...అనురాధ, తహసీల్దార్, గ్రామీణ మండలం

గ్రామీణ మండలంలో మొరం తవ్వకాలకు ఎవరికీ అనుమతులు ఇవ్వలేదు. అక్రమంగా మొరం తరలిస్తే వాహనాలు సీజ్ చేసి కఠిన చర్యలు తీసుకుంటాం.

రైతులు నష్టపోకుండా చర్యలు

వర్ని, న్యూస్‌టుడే : రైతులు నష్టపోకుండా చర్యలు తీసుకుంటున్నామని, వానాకాలంలో పండించిన వరి పంట ప్రతి గింజను ప్రభుత్వమే కొనుగోలు చేస్తుందని ప్రభుత్వ వ్యవసాయ సలహాదారు, ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. హుమ్నాపూర్‌లో ఆగ్రోస్ ఇండస్ట్రీ ఛైర్మన్ కాసుల బాల్‌రాజుతో కలిసి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని గురువారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ.. ప్రభుత్వం ఇచ్చిన హామీ ప్రకారం సన్నరకం ధాన్యం పండించిన రైతులకు రూ.500 బోనస్ ఇస్తామని తెలిపారు. అవసరమైన ప్రతి చోట తెరిచేందుకు కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. రైతులు కంగారుపడి దళారులకు తక్కువ ధరకు ధాన్యం అమ్ముకుని నష్టపోవద్దన్నారు. ధాన్యం డబ్బులు వారంలో నేరుగా రైతుల ఖాతాల్లో డబ్బులు జమ అవుతాయని వెల్లడించారు. కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ సమావేశంలో వర్ని, హుమ్నాపూర్ మార్కెట్ కమిటీ ఛైర్మన్లు సురేష్‌బాబా, కకరాల్లే, వీర్రాజు, గంగారాం తదితరులు పాల్గొన్నారు.



కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే పోచారం

బాలోత్సవం విజయవంతానికి సహకరించండి

నిజామాబాద్ విద్యావిభాగం, న్యూస్‌టుడే: జిల్లాస్థాయిలో 3 వేల మంది విద్యార్థులతో బాలోత్సవ కార్యక్రమం నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామని, విజయవంతానికి సహకరించాలని స్టీరింగ్ కమిటీ సభ్యులు, మున్సిపల్ కమిషనర్ మకరందుతో కలిసి గురువారం కలెక్టర్ రాజీవ్ గాంధీ హన్మంతుకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమ ఏర్పాట్లను వివరించారు. విజయవంతంగా నిర్వహించేందుకు డీఈవోకి సూచించాలని అభ్యర్థించారు. సానుకూలంగా స్పందించినట్లు వెల్లడించారు. బాలోత్సవ కార్యక్రమాన్ని గతంలో నిర్వహించిన 8, 9 తేదీల్లో కాకుండా.. 12, 13వ తేదీల్లో నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. డా.అయ్యన్న కొండు, డా.సూరి, నర్రా రామారావు, కె.రామ్మోహన్‌రావు, ప్రసాద్‌రావు తదితరులున్నారు.



కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతుతో మాట్లాడుతున్న ప్రతినిధులు

వైభవంగా రథోత్సవం

డిచ్‌పల్లి, న్యూస్‌టుడే : డిచ్‌పల్లి ఏడో బెటాలియన్‌లో లక్ష్మీవేంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు ఘనంగా కొనసాగుతున్నాయి. గురువారం సాయంత్రం నిర్వహించిన రథోత్సవ వేడుకకు త్రిదండి దేవనాథ జీయర్ స్వామి హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం నిత్య ఆరాధన, హవనము, బలి ప్రదానం, తీర్థగోష్ఠి, సాయంత్రం ఆరాధన, నిత్యహవనము బలిప్రదానం, తీర్థగోష్ఠి, రాత్రి క్షీరచంద్ర దర్శనం, హారతి, తీర్థ ప్రసాద వితరణ కార్యక్రమాలు చేపట్టారు. మధ్యాహ్నం భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు. బ్రహ్మోత్సవాల్లో బెటాలియన్ అధికారులు, సిబ్బంది, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



రథోత్సవానికి హాజరైన త్రిదండి దేవనాథ జీయర్ స్వామి, భక్తులు

ఆర్యసమాజ్‌లో పూర్ణిమ హోమం

నిజామాబాద్ సాంస్కృతికం, న్యూస్‌టుడే: ఇందూరు ఆర్య సమాజ్ ఆధ్వర్యంలో ఆశ్వయుజ పౌర్ణమి సందర్భంగా గురువారం హోమం, వేద పఠనం, మంత్ర పారాయణాలు చేశారు. ఆటలు, పాటలతో పాటు సాంస్కృతిక ప్రదర్శనలు, భజనలు, భక్తి గీతాలను ఆలపించారు. వెన్నెల వెలుగులో ఉంచిన పాలతో తయారుచేసిన పాయసాన్ని సేవించారు. కార్యక్రమంలో అధ్యక్షుడు సూర్యప్రకాశ్, నారాయణ, ఆచార్య వేదమిత్ర, తదితరులు పాల్గొన్నారు.

ఫీజు రీయింబర్స్‌మెంట్ చెల్లించాలని వినతి

బోధన్ గ్రామీణం, న్యూస్‌టుడే : గత మూడేళ్లుగా పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్ తక్షణమే చెల్లించాలని బోధన్‌లోని ప్రైవేట్ డిగ్రీ కళాశాలల ప్రతినిధులు డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం అంబేద్కర్ చౌరస్తా నుంచి సబ్‌కలెక్టర్ కార్యాలయం వరకు అధ్యాపకులు, విద్యార్థులతో కలిసి ముఖానికి నల్ల రుమాళ్లు కట్టుకుని నిరసనగా ర్యాలీ చేపట్టారు. అక్కడ కొద్దిసేపు బైఠాయించి నినాదాలు చేశారు. బకాయిలు విడుదల చేయకపోవడంతో కళాశాలల నిర్వహణ కష్టతరంగా మారిందని ప్రతినిధులు చెప్పారు. అనంతరం సబ్‌కలెక్టర్ వికాస్ మహతోకు సమస్యలతో కూడిన వినతిపత్రం అందించారు. ఈ కార్యక్రమంలో ప్రతినిధులు రవిపటేల్, శ్రీధర్‌రాజు, షేక్ రఫీద్, గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.



సబ్‌కలెక్టర్‌కు పత్రం అందిస్తున్న ప్రతినిధులు

ఎంపీడీవో కార్యాలయానికి తాళం

• కిరాయి చెల్లించకపోవడంతో యజమాని ఆగ్రహం

వర్ని, న్యూస్‌టుడే: కిరాయి చెల్లించడం లేదని చందూర్ మండల పరిషత్ కార్యాలయానికి గురువారం ఆ ఇంటి యజమాని తాళం వేసి ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎంపీడీవో నీలవతి, కార్యాలయ సిబ్బంది ఉదయం పది గంటలకు కార్యాలయానికి వచ్చే సరికి యజమాని తాళం వేసి ద్వారం వద్ద బైఠాయించారు. కిరాయి చెల్లించే వరకు కార్యాలయ తాళం తీయనని భీష్మించారు. 26 నెలలుగా తనకు కిరాయి చెల్లించలేదని, పలుమార్లు అడిగినా అధికారులు పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రస్తుతం అద్దె చెల్లిస్తేనే కార్యాలయం తాళం తీస్తానని, లేని పక్షంలో తీసేది లేదన్నారు. దీంతో కార్యాలయ సిబ్బంది, వివిధ పనులకు వచ్చిన ప్రజలు కార్యాలయం బయట వేచి ఉన్నారు. కిరాయి ఎందుకు చెల్లించడం లేదని వివిధ పనుల నిమిత్తం వచ్చిన పలువురు అధికారులను ప్రశ్నించారు. విషయం తెలుసుకున్న స్థానిక ప్రజాప్రతినిధులు, గ్రామపెద్దలు యజమానికి త్వరలోనే కిరాయి ఇప్పించేలా చూస్తామని భరోసా ఇవ్వడంతో గంట తర్వాత తాళం తీశారు. ఈ విషయమై ఎంపీడీవో నీలవతిని 'న్యూస్‌టుడే' వివరణ కోరగా.. ఈ సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లామని, ఇక నుంచి కార్యాలయానికి వచ్చే 15వ ఆర్థిక సంఘం నిధుల నుంచి అద్దె బకాయిలు చెల్లిస్తామని ఇంటి యజమానికి చెప్పామని వివరించారు.



కార్యాలయానికి తాళం వేసిన యజమాని

సదస్సు జయప్రదం చేసినందుకు కృతజ్ఞతలు

ఖలీల్‌వాడి: ఎమ్మార్పీఎస్,అనుబంధ సంఘాల రాష్ట్ర సదస్సు విజయవంతం చేసినందుకు ఎంఎస్పీ జిల్లా అధ్యక్షుడు పోశెట్టి, ఎమ్మార్పీఎస్ జిల్లాధ్యక్షుడు ప్రమోద్ కృతజ్ఞతలు తెలిపారు.


ఆర్టీసీ బస్సు తగిలి కారు ధ్వంసం

నిజామాబాద్ నేరవిభాగం : ఒకటో రాణా పరిధిలో కారు, ఆర్టీసీ బస్సు ఒకదానికి ఒకటి తగిలి ప్రమాదం జరిగింది. పోలీసుల వివరాల ప్రకారం.. ధర్పల్లి మండలం హొన్నాజీపేటకు చెందిన లక్ష్మీనారాయణగౌడ్ పనిపై నగరానికి వచ్చారు. గురువారం బస్టాండ్ వద్దనున్న కవిత కాంప్లెక్స్ ఎదుట ఉన్న రోడ్డుపై వెళ్తుండగా బస్సు ఆయన కారు ఒకదాన్ని ఒకటి తగులుతూ వెళ్లాయి. ఘటనలో కారు ధ్వంసం కావడంతో యజమాని ఫిర్యాదు మేరకు బస్సు డ్రైవర్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌హెచ్‌వో రఘుపతి తెలిపారు.

గుంత పూడ్చే.. చింత తీరే..



డిచ్‌పల్లి, న్యూస్‌టుడే : డిచ్‌పల్లి మండలం ముల్లంగి నుంచి మోపాల్ మండలం కంజర వెళ్లే రోడ్డు మధ్యలోని కల్వర్టు వద్ద ప్రమాదకర గుంత ఏర్పడిందని ఈ నెల 7వ తేదీన 'ఈనాడు'లో 'రోడ్డు కోత.. ప్రయాణికుల వెత' శీర్షికన కథనం ప్రచురితమైంది. స్పందించిన ఆర్అండ్‌బీ అధికారులు సంబంధిత గుత్తేదారుతో గుంత ఏర్పడిన ప్రాంతంలో మొరం పోయించారు. దీంతో ప్రయాణికుల చింత తీరినట్లు అయింది.



ఐద్వా జిల్లా కమిటీ ఎన్నిక

ఖలీల్‌వాడి, న్యూస్‌టుడే : జిల్లా ఐద్వా కమిటీని గురువారం ఎన్నుకున్నారు. అధ్యక్షురాలిగా అనిత, ప్రధానకార్యదర్శిగా సుజాత, సభ్యులుగా లావణ్య, రజియా, వనజ, హసీనా, సాయమ్మ, విజయలక్ష్మి ఎన్నికయ్యారు.

కొనుగోలు కేంద్రం ప్రారంభం

కోటగిరి : ఎత్తొండ సహకార సంఘం ఆధ్వర్యంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని గురువారం విండో ఇన్‌ఛార్జి ఛైర్మన్ దాసు ప్రారంభించారు. కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. తహసీల్దార్ గంగాధర్, పాలకవర్గ సభ్యులు పాల్గొన్నారు.

విలీన మహాసభకు తరలిరావాలి

మోపాల్, సిరికొండ, రెంజల్, న్యూస్‌టుడే: టీయూసీఐ, ఐఎఫ్‌టీయూ విలీన సభను ఈ నెల 20న హైదరాబాద్‌లో ఏర్పాటు చేసినట్లు, ఈ సభకు ప్రజలు తరలిరావాలని ఐఎఫ్‌టీయూ జిల్లా ఉపాధ్యక్షుడు ఎం.వెంకన్న కోరారు. ఇందుకు సంబంధించిన గోడప్రతులను గురువారం మోపాల్‌లో నాయకులతో కలిసి ఆవిష్కరించి మాట్లాడారు. జిల్లా నాయకులు సీహెచ్ సాయన్న, మండల కార్యదర్శి గంగమల్లు తదితరులున్నారు. సిరికొండ, రెంజల్ మండలం బోర్గాంలోనూ గోడప్రతులు ఆవిష్కరించారు. రామకృష్ణ, నాగన్న, ఒడ్డెన్న, పార్వతి, రాజేశ్వర్, నసీర్, పోశెట్టి, గోపాల్ ఉన్నారు.

బాధిత కుటుంబానికి సాయం

రెంజల్ : సాటాపూర్‌కు చెందిన పత్తిసురేష్ ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడ్డారు. వైద్యం నిమిత్తం ఆయనకు స్థానికులు గురువారం రూ.21వేలు అందించారు. ఎకార్‌పాషా, గంగాధర్‌రెడ్డి, నగేష్, రామన్న పాల్గొన్నారు.

పాఠశాల తనిఖీ

నిజామాబాద్ విద్యావిభాగం : మిర్చి కాంపౌండ్ ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాలను గురువారం డీఈవో దుర్గాప్రసాద్ తనిఖీ చేశారు. విద్యార్థుల నైపుణ్యాలు, మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు.

ఇబ్బందులు లేకుండా విక్రయించాలి

నిజామాబాద్ వ్యవసాయం : వినియోగదారులకు ఇబ్బందులు కలగకుండా వ్యాపారులు కూరగాయలు విక్రయించాలని నిజామాబాద్ వ్యవసాయ మార్కెట్ కమిటీ ఛైర్మన్ ముప్ప గంగారెడ్డి సూచించారు. గురువారం తెల్లవారు జామున ఆయన శ్రద్ధానంద్ గంజ్‌లోని హోల్‌సేల్ కూరగాయల మార్కెట్ యార్డును పరిశీలించారు. కేటాయించిన మడిగెల్లోనే విక్రయాలు నిర్వహించుకోవాలని చెప్పారు. మార్కెట్‌లో నెలకొన్న సమస్యలు పరిష్కరించేందుకు కృషి చేస్తానని భరోసా ఇచ్చారు. ఏఎంసీ డైరెక్టర్లు నరేందర్, మల్లేశ్ తదితరులున్నారు.



పూలమాలలు వేసి పూజలు చేస్తున్న ప్రతినిధులు

వాల్మీకి జయంతి వేడుకలు

నిజామాబాద్ సాంస్కృతికం, న్యూస్‌టుడే: నిజామాబాద్ వాల్మీకి సమాజ్ ఆధ్వర్యంలో గురువారం నగరంలోని ఇంద్రాపూర్‌లో వాల్మీకి జయంతి వేడుకలు నిర్వహించారు. చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో కిరణ్, కిషన్, అంగరసింగ్, విజేందర్ సింగ్, పవన్ తదితరులు పాల్గొన్నారు.

రెంజల్, న్యూస్‌టుడే : రెంజల్ తహసీల్ కార్యాలయంలో గురువారం వాల్మీకి జయంతి నిర్వహించారు. తహసీల్దార్ శ్రవణ్‌కుమార్, ఆర్‌ఐ రవి వాల్మీకి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు.

నిజామాబాద్ నేరవిభాగం : పోలీసు శాఖ ఆధ్వర్యంలో నిజామాబాద్ పోలీసు కమిషనరేట్ కార్యాలయంలో గురువారం మహర్షి వాల్మీకి జయంతి వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అదనపు డీసీపీలు కోటేశ్వరరావు, బస్వారెడ్డి, శంకర్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

సరికొత్త రక్షణ కవచం

వాహనాల వినియోగం పెరగడంతో రోడ్లు రద్దీగా మారాయి. పైగా రోడ్లపై గుంతలు పడటం, దుమ్ము, ధూళి చేరడంతో భారీ వాహనాల వెనకాల వెళ్లే ద్విచక్ర వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. కొన్నిసార్లు కళ్లలో దుమ్మపడి ప్రమాదాలు జరుగుతున్నాయి. మోస్రా మండలం చింతకుంటకు చెందిన రవి ఆన్‌లైన్‌లో ఈ పరికరం కొనుగోలు చేసి వినియోగిస్తున్నారు. దీనివల్ల దూళి, పురుగుల ఇబ్బంది పెట్టవని, రాత్రిపూట ఎదురొచ్చే వాహనం స్పష్టంగా కనిపిస్తుందని చెబుతున్నారు.



– ఈనాడు, నిజామాబాద్

తడుస్తున్న ధాన్యం.. తప్పని తిప్పలు

వానాకాలం సీజన్ పంటలు కోస్తున్న సమయంలో వర్షాలు పడుతుండడంతో అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు. గురువారం డిచ్‌పల్లిలో కురిసిన వర్షంతో ఇప్పటికే కోసిన ధాన్యాన్ని ఆరబెట్టిన రైతులు నానా అవస్థలు పడ్డారు. సర్కారు కొనుగోలు కేంద్రాలను ప్రారంభిస్తే తమ బాధలు తీరుతాయని, ఆ దిశగా ప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకోవాలని అన్నదాతలు కోరుతున్నారు.

– న్యూస్‌టుడే, డిచ్‌పల్లి



డిచ్‌పల్లిలో రహదారిపై ఆరబెట్టిన ధాన్యం వర్షానికి తడిసిపోవడంతో కుప్ప చేస్తున్న రైతులు

చెరువులో దూకి ఆత్మహత్య

నిజామాబాద్ నేరవిభాగం, న్యూస్‌టుడే: ఆర్థిక సమస్యలతో ఓ వ్యక్తి చెరువులో దూకి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన ఆలస్యంగా వెలుగుచూసింది. పోలీసుల వివరాల ప్రకారం.. నెహ్రూనగర్‌లో నివాసముండే షేక్ ఖయ్యూం(51) బుధవారం రాత్రి ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగిరాలేదు. ఆయన ఇంటికి రాకపోవడంతో భార్య బంధువులను ఆరా తీసినా ఆచూకీ లభించలేదు. గురువారం ఉదయం పోలీసులను ఆశ్రయించి ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించగా.. నెహ్రూనగర్ ప్రాంతంలో చెరువులో దూకి ఆత్మహత్య చేసుకున్నట్లు గుర్తించారు. ఆర్థిక ఇబ్బందులతో ఆత్మహత్య చేసుకున్నట్లు పోలీసుల ప్రాథమిక నిర్ధారణకు వచ్చారు.



షేక్ ఖయ్యూం

భార్య మరణం తట్టుకోలేక భర్త బలవన్మరణం

నిజామాబాద్ గ్రామీణం, న్యూస్‌టుడే: మండలంలోని కొత్తపేట్ గ్రామానికి చెందిన పెద్దోళ్ల లింగం(54) బుధవారం నిజాంసాగర్ కాల్వలో పడి మృతిచెందిన విషయం విదితమే. దర్యాప్తు చేసిన రూరల్ పోలీసులు లింగం ఆత్మహత్య చేసుకున్నట్లు నిర్ధారించారు. ఆయన భార్య 24 రోజుల కిందట నిజాంసాగర్ కాల్వలో దుస్తులు శుభ్రం చేస్తూ ప్రమాదవశాత్తు అందులో పడి మృతిచెందారు. ఆమె మరణం తట్టుకోలేక మనస్తాపానికి గురైన ఐదు రోజుల నుంచి కాల్వ దగ్గరకు వెళ్లి తాను చనిపోతా

క్రైమ్ కార్నర్

నని స్థానికులతో చెప్పారు. ఈ క్రమంలో బుధవారం నిజాంసాగర్ కాల్వ వద్ద ఎవరూ లేని సమయంలో అందులో దూకి ఆత్మహత్యచేసుకున్నట్లు ఎస్‌హెచ్‌వో మహమ్మద్ ఆరిఫ్ పేర్కొన్నారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు గురువారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌హెచ్‌వో తెలిపారు.

పురుగుల మందు తాగి..

మోపాల్ : పురుగుల మందుతాగి ఒకరు ఆత్మహత్య చేసుకున్న ఘటన మోపాల్ మండలం నర్సింగ్‌పల్లి గ్రామంలో చోటుచేసుకుంది. ఎస్‌హెచ్‌వో యాదగిరి తెలిపిన వివరాల ప్రకారం.. జక్రాన్‌పల్లి మండలం తొర్లికొండకు చెందిన గడ్డం రమేష్(45) కూలీ పనులు చేస్తూ జీవించేవారు. ఆయన మొదటి భార్య చనిపోవడంతో రెండో పెళ్లి చేసుకున్నారు. రెండో భార్య కూడా గతకొంత కాలంగా విడిగా ఉండడంతో జీవితంపై విరక్తి చెందారు. ఈ క్రమంలో మోపాల్ మండలం నర్సింగ్‌పల్లిలోని కుమార్తె వద్దకు వెళ్తున్నానని చెప్పి ఇంట్లో నుంచి బయలుదేరి.. ఓ వెంచర్‌లో పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నారు. గుర్తించిన స్థానికులు పోలీసులకు సమాచారం ఇవ్వగా.. వారు అక్కడికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జిల్లా ప్రభుత్వ ఆస్పత్రి తరలించారు. మృతుడి కుమారుడు పురుషోత్తం ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌హెచ్‌వో పేర్కొన్నారు.

నివాసంలో చోరీ

నిజామాబాద్ నేరవిభాగం : ఐదో రాణా పరిధిలో తాళం వేసిన ఇంట్లో చోరీ జరిగింది. పోలీసుల వివరాల ప్రకారం.. నగరంలోని సీతారాంనగర్ కాలనీలో నివాసం ఉండే దిలీప్ రెండు రోజుల కిందట ఇంటికి తాళం వేసి వినాయక్‌నగర్‌లోని కుమార్తె దగ్గరకు వెళ్లారు. గురువారం ఇంటి తాళం పగులగొట్టి ఉండడం గమనించిన స్థానికులు ఆయనకు సమాచారం అందించారు. ఇంటికి వచ్చిన ఆయన చోరీ జరిగినట్లు గుర్తించారు. దుండగులు బీరువా ధ్వంసం చేసి అందులోని రూ.25 వేల నగదు, బంగారం, వెండి ఆభరణాలు చోరీ చేసినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌హెచ్‌వో గంగాధర్ తెలిపారు. ఇంటి ఎదుట ఉన్న సీసీ కెమెరా ద్వారా దొంగతనానికి వచ్చిన ముగ్గురు వ్యక్తులను గుర్తించే పనిలో ఉన్నామని ఎస్‌హెచ్‌వో తెలిపారు.

ఇంటిపై దుండగుల రాళ్ల దాడి

రెంజల్ : రెంజల్ మండలం వీరన్నగుట్టలోని ఓ ఇంటిపై గుర్తు తెలియని వ్యక్తులు బుధవారం అర్ధరాత్రి ఇటుకలు, రాళ్లతో దాడి చేసి కుటుంబీకులను భయాందోళనకు గురి చేశారు. బాధితుడు, పోలీసుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన మల్లేష్ అనే వ్యక్తి ఇంటిపైకి దుండగులు అరగంట పాటు ఇటుకలు, రాళ్లు విసిరారు. దుండగుల దాడితో ఇంటి రేకులకు రంధ్రాలు పడ్డాయి. భయాందోళనకు గురైన బాధిత కుటుంబం పోలీసులకు సమాచారం అందించగా పెట్రోలింగ్‌లో ఉన్న పోలీసులు అక్కడికి చేరుకుని చుట్టుపక్కల ప్రాంతాలు పరిశీలించారు. బాధితుడి ఇంటి పక్కన ఉన్న ఓ డాబాపై ఇటుకలు, రాళ్లు ఉండటం, విందు చేసుకున్న ఆనవాళ్లు ఉండటాన్ని గుర్తించారు. బాధితుడు మల్లేష్ గురువారం రాణాకు వెళ్లి పలువురు అనుమానితులపై ఫిర్యాదు చేశారు.

తొమ్మిది మంది జూదరుల అరెస్టు

ధర్పల్లి, న్యూస్‌టుడే: ధర్పల్లి శివారులో జూదం ఆడుతున్నారనే సమాచారం మేరకు గురువారం సాయంత్రం జూద స్థావరంపై దాడి చేసినట్లు ఎస్సై రామకృష్ణ తెలిపారు. 9 మందిని అరెస్టు చేసి వారిపై కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు. వారి నుంచి రూ.12 వేలు, ఆరు ద్విచక్ర వాహనాలు స్వాధీనం చేసుకున్నామన్నారు.

కల్తీ పాల తయారీ?



నవీపేట, న్యూస్‌టుడే: నవీపేట శివారులోని మిషన్‌భగీరథ ట్యాంకు మూల మలుపు వద్ద ఉన్న ఉప కాల్వలో ఖాళీ పాల పొడి పొట్లాలు సంచిని గ్రామస్థులు గురువారం గుర్తించారు. సంచిలో వందల సంఖ్యలో వాడి పడేసిన పొట్లాలు లభ్యం కావడంతో కొందరు వ్యాపారులు కల్తీ పాలు తయారు చేసి స్థానికంగా విక్రయిస్తున్నారని ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. అధికారులు విచారణ చేసి బాధ్యులపై చర్యలు చేపట్టాలని స్థానికులు డిమాండు చేస్తున్నారు.

సమసమాజం కోసం భాజపా కృషి

నిజామాబాద్ నగరం, న్యూస్‌టుడే: అసమానతలు లేని సమసమాజం కోసం భాజపా కృషి చేస్తుందని రాష్ట్ర కార్యదర్శి పల్లె గంగారెడ్డి అన్నారు. గురువారం జిల్లా పార్టీ కార్యాలయంలో వాల్మీకి జయంతిని ఎస్సీ మోర్చా జిల్లా అధ్యక్షుడు బీజర్ శివప్రసాద్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దళిత సమాజానికి చెందిన వాల్మీకి మహర్షి రామాయణాన్ని రచించడం గొప్ప విషయమన్నారు. ఇస్కాన్ బృందం ఆధ్వర్యంలో భజన నిర్వహించారు. కార్యక్రమంలో పవార్, బాలకృష్ణ, సంజయ్, ముక్కరాసింగ్, శేఖర్ పాల్గొన్నారు.



ఇస్కాన్ ఆధ్వర్యంలో భజన

సర్వే చేయించాలని ధర్నా

ధర్పల్లి, న్యూస్‌టుడే: రామడుగులో పేదలకు కేటాయించిన భూమి విషయంలో లబ్ధిదారులను అటవీ అధికారులు ఇబ్బందులకు గురిచేస్తున్నారని, ఆ భూమిని రెవెన్యూ, అటవీ అధికారులతో జాయింట్ సర్వే చేయించి పేదలకు ఇప్పించాలని సీపీఐ (ఎంఎల్) మాస్‌లైన్ రాష్ట్ర నాయకుడు రామకృష్ణ డిమాండ్ చేశారు. ధర్పల్లి తహసీల్దార్ కార్యాలయం ఎదుట గురువారం లబ్ధిదారులతో కలిసి ధర్నా నిర్వహించారు. వారం రోజుల్లో జాయింట్ సర్వే చేయిస్తానని తహసీల్దార్ హామీ ఇవ్వడంతో ధర్నా విరమించారు. అనంతరం తహసీల్దార్ మాలతికి వినతిపత్రం ఇచ్చారు. నాయకులు రమేష్, దామోదర్ తదితరులున్నారు.



తహసీల్దార్ మాలతికి వినతిపత్రం ఇస్తున్న సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ నాయకులు, లబ్ధిదారులు

ఆర్మూర్
● ఆర్మూర్ ● బాల్కొండ

కాంగ్రెస్‌లో చేరిక

బాల్కొండ, న్యూస్‌టుడే: బాల్కొండకు చెందిన పలువురు భారాస నాయకులు హైదరాబాద్‌లో కాంగ్రెస్ బాల్కొండ నియోజకవర్గ ఇన్‌ఛార్జి సునీల్ కుమార్ సమక్షంలో గురువారం హస్తం పార్టీలో చేరారు. బాల్కొండ మాజీ ఉప సర్పంచి షేక్‌వాహబ్, వేల్పూర్ మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ సయ్యద్ మజారొద్దీన్, సొసైటీ డైరెక్టర్ నర్సయ్య, వీడీసీ మాజీ అధ్యక్షుడు అశోక్, నాయకులు గంగాధర్, ఎర్రన్న, నరేష్, ఆరీఫ్, ఉమేర్, తౌఫిక్ తదితరులు పార్టీ మారారు.



గోడప్రతుల ఆవిష్కరణ

కమ్మర్‌పల్లి: ఐఎఫ్‌టీయూ-టీయూసీఐ విలీన సభ గోడప్రతులను కమ్మర్‌పల్లి బీడీ ప్యాకింగ్ సెంటర్‌లో జిల్లా ఉపాధ్యక్షురాలు సత్తెక్క గురువారం ఆవిష్కరించారు. విలీనంతో కార్మికుల ఉద్యమాలు, పోరాటాలకు తోడ్పాటు లభిస్తోందని, బీడీ ప్యాకర్లంతా హాజరై సభను విజయవంతం చేయాలని కోరారు. అశోకు, ఖాదీర్, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.



పీవీఆర్ మల్టీప్లెక్స్ (ఆర్మూర్) — ఈనాడు సినిమాలు

స్క్రీన్–1 జిగ్రా: 11.30, 5.40
మా నాన్న సూపర్ హీరో: 2.50 మార్టిన్: 9.00
స్క్రీన్–2 దేవర: 11.15, 2.50, 6.25, 10.00
స్క్రీన్–3 వెట్టయాన్ ది హంటర్: 11.50, 3.20, 6.50, 10.20
స్క్రీన్–4 విశ్వం: 10.00, 4.15, 10.30
జనక అయితే గనక: 1.15, 7.30
ఆర్మూర్ పట్టణం, న్యూస్‌టుడే

మేమున్నాం.. మీకు తోడుగా..

94939 26837
98666 11160

వేగ నిరోధకాలు తొలగించారు

ఆర్మూర్ పట్టణం: ఆర్మూర్ పట్టణంలోని ఎంజే రోడ్డులో అనధికారికంగా స్పీడ్ బ్రేకర్లు నిర్మించారని స్థానికులు 'మేమున్నాం..మీకు తోడుగా'కు దృష్టికి తీసుకొచ్చారు. సమస్యను పుర కమిషనర్ రాజుకు తెలియజేయడంతో స్పందించారు. గురువారం వాటిని తొలగించారు.

దీపాలు వెలిగాయి

మాక్లూర్ (గ్రామీణం): మాక్లూర్ మండలం మదన్‌పల్లి తండాలో విద్యుత్తు స్తంభాలకు వీధీ దీపాలు వెలగడం లేదని 'మేమున్నాం మీకు తోడుగా'కు సమస్య చెప్పటంతో 'ఈనాడు'లో ప్రచురితమైంది. స్పందించిన ఎంపీవో శ్రీనివాస్ వీధీ దీపాలను పెట్టించారు.

చెత్తశుద్ధి కరవు.. సేకరణ బరువు

☛ ఆర్మూర్‌లో పరిస్థితి అధ్వానం

ఇంటింటా నిత్యం తడి పొడి చెత్తను వేర్వేరుగా సేకరించాలన్న లక్ష్యం ఆర్మూర్ బల్దియాలో అమలు కావడం లేదు. వేర్వేరుగా సేకరణ పక్కన పెడితే, వాహనాల కొరతతో అసలు చెత్త సేకరణే సక్రమంగా జరగడం లేదు. ఫలితంగా ఖాళీ స్థలాల్లో చెత్త పారేస్తున్న పరిస్థితి. అధికారులు పట్టించుకోకపోవడంతోనే ఇలాంటి పరిస్థితి వచ్చిందనే ఆరోపణలున్నాయి. ఇటీవల మూడు వాహనాలు కొనుగోలు చేశారు. ఇప్పుడైనా సేకరణ మెరుగుపడుతుందో లేదో చూడాలి మరి.
– న్యూస్‌టుడే, ఆర్మూర్ పట్టణం

చెత్తను బహిరంగ ప్రదేశాల్లో వేయొద్దని, బల్దియా కార్మికులకు మాత్రమే అందజేయాలని విస్తృతంగా ప్రచారం చేస్తున్నా, అందుకు తగినట్లు ఏర్పాట్లు, పర్యవేక్షణ చేయడం లేదు. నివాసాల నుంచి ఉచితంగానే సేకరిస్తున్నా.. వ్యాపార సముదాయాల నుంచి రుసుము వసూలు చేస్తారు. ఆ ప్రక్రియ కొన్ని చోట్ల మాత్రమే సాగుతోంది. ఆర్మూర్ బస్టాండ్ ఆవరణలో పలువురు వ్యర్థాలను వేయడంతో పాటు నిప్పు పెడుతున్నా పట్టించుకోవడం లేదు. బహిరంగ ప్రదేశాల్లో వేస్తే పట్టుకొని జరిమానా వేయాల్సిన అధికారులు చూసీచూడనట్లుగా వ్యవహరిస్తున్నారు.

వాహనాలు వార్డులకు కేటాయించాం

కొనుగోలు చేసిన మూడు చెత్త సేకరణ వాహనాల్లో అదనపు ఏర్పాట్లు చేయించాం. వాటిని ఆయా వార్డులకు కేటాయించాం. తడి, పొడి చెత్తను వేర్వేరుగా సేకరించేందుకు కసరత్తు చేస్తున్నాం. త్వరలోనే ఆ ప్రక్రియను ప్రారంభిస్తాం. ప్రజలు వ్యర్థాలు బయట పారేయవద్దు.
– రాజు, పుర కమిషనర్, ఆర్మూర్

మూడు రోజులుగా రాలేదు
– సంతోషిని, మామిడిపల్లి

గత మూడు రోజులుగా చెత్త సేకరణకు రాలేదు. వ్యర్థాలు ఇళ్లలోనే పేరుకుపోతున్నాయి. చెత్త బయట వేయొద్దని అధికారులు చెబుతున్నా అందుకు తగిన ఏర్పాట్లు చేయడం లేదు. ఫలితంగా సమస్యలు తలెత్తుతున్నాయి. నిత్యం చెత్త సేకరణ బండ్లు వచ్చేలా చర్యలు తీసుకోవాలి.

దుర్వాసన వస్తోంది
– లక్ష్మి, ఆర్మూర్

గతంలో చెత్త సేకరణ నిత్యం వచ్చేది. వాహనాల కొరత, మరమ్మతుల పేరిట రెండు, మూడు రోజులకోసారి వస్తున్నారు. ఇంట్లో వ్యర్థాలు పేరుకొని దుర్వాసన వస్తోంది.



బస్టాండ్ ఆవరణలో వేసిన వ్యర్థాలు

బల్దియా వివరాలు..

వార్డులు	36
నివాసాలు	22,188
చెత్త సేకరణ ఆటోలు	26
నిత్యం వెలువడే వ్యర్థాలు	30 మె.ట
జనాభా	74,005
సేకరిస్తున్నది	25 మె.ట వరకు
పారిశుద్ధ్య కార్మికులు	18 (శాశ్వత), 141 (ఔట్‌సోర్సింగ్)

జిల్లాస్థాయి పోటీలకు ఎంపిక



క్రీడాకారులతో ఉపాధ్యాయులు

భీమ్‌గల్, న్యూస్‌టుడే: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ క్రీడల్లో భాగంగా జిల్లాస్థాయి టోర్నీకి భీమ్‌గల్, వేల్పూర్ మండలాల పాఠశాలల నుంచి క్రీడాకారులను గురువారం ఎంపిక చేసినట్లు పీడీ సదమస్తుల రమణ తెలిపారు. పట్టణంలోని కృషి ఉన్నత పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో పాఠశాలకు నలుగురు క్రీడాకారులు చొప్పున పాల్గొన్నారు. అండర్-14, అండర్-17 బాలబాలికల విభాగంలో ఉత్తమ క్రీడాకారులను ఎంపిక చేశారు. ఈ జట్టు శుక్రవారం సిర్పూర్‌లో జరుగనున్న జిల్లాస్థాయిలో టోర్నీలో పాల్గొంటుందన్నారు. మండల విద్యాధికారి డి.స్వామి, పీఈటీయూ మండలాధ్యక్షుడు శేఖర్, పీడీలు రాజేందర్, రాజు, సురేష్, చిన్నయ్య, ఉపాధ్యాయులు అజిత్‌రెడ్డి, వాసుదేవ్, వినోద్, మురళి తదితరులు పాల్గొన్నారు.

కబడ్డీలో జోనల్‌స్థాయి జట్టు



బషీరాబాద్‌లో ఎంపికైన క్రీడాకారులతో ఎంఈవో ఆంధ్రయ్య, ఉపాధ్యాయులు

కమ్మర్‌పల్లి, న్యూస్‌టుడే: కమ్మర్‌పల్లి జోనల్ స్థాయి కబడ్డీ ఎంపిక పోటీలు బషీరాబాద్ ఉన్నత పాఠశాలలో గురువారం జరిగాయి. జోనల్ పరిధిలోని మోర్తాడ్, కమ్మర్‌పల్లి, ఏర్గట్ల మండలాల నుంచి వచ్చిన విద్యార్థులకు పోటీలు నిర్వహించారు. ఉత్తమ ప్రతిభ కనబరిచిన వారిని అండర్-14, అండర్-17 బాలబాలికల జట్లకు ఎంపిక చేశారు. ఎంఈవో ఆంధ్రయ్య, ప్రధానోపాధ్యాయులు గంగాధర్, పీఈటీ ప్రేమ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

సాఫ్ట్‌బాల్‌లో..



ఆర్మూర్ పట్టణం, న్యూస్‌టుడే: ఆర్మూర్ సాంఘిక సంక్షేమ బాలుర పాఠశాల ఆవరణలో జిల్లా సబ్ జూనియర్ సాఫ్ట్‌బాల్ ప్రాబబుల్స్ బాలుర జట్టును గురువారం ఎంపిక చేశారు. ఎంపికైన క్రీడాకారులకు శిక్షణ శిబిరం నిర్వహించి, తుది జట్టును ఖరారు చేస్తామన్నారు. తుది జట్టు రాష్ట్ర సబ్ జూనియర్ సాఫ్ట్‌బాల్ పోటీలకు హాజరవుతుందని తెలిపారు. కార్యక్రమంలో సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు ప్రభాకర్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి గంగామోహన్, స్థానిక వైస్ ప్రిన్సిపల్ సాయన్న, గంగాధర్, నరేష్, జ్ఞానేశ్వర్, సంతోష్, రాజేందర్ పాల్గొన్నారు.

పోచమ్మ పండుగ

నాగాపూర్(బాల్కొండ), న్యూస్‌టుడే: నాగాపూర్‌లో గ్రామాభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో లంబాడి పోచమ్మ పండుగను గురువారం నిర్వహించారు. అమ్మవారిని అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. నైవేద్యాలు సమర్పించారు. పంటలు బాగా పండాలని, ప్రజలు సుఖ సంతోషాలతో ఉండాలని, పశు సంపద బాగుండాలని పూజలు చేశారు. ప్రజలు వన భోజనాలకు వెళ్లారు. గ్రామ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.



నాగాపూర్‌లో..

మల్లన్న దేవుని మాసోత్సవాలు

బాల్కొండ, న్యూస్‌టుడే: బాల్కొండలో మల్లన్న దేవుని మాసోత్సవాలు గురువారం ఆలయ, గ్రామ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించారు. ప్రతి నెల పౌర్ణమి రోజున ఉత్సవాలు నిర్వహిస్తుంటారు. గుట్టమీదున్న గల మల్లన్న దేవునికి అభిషేక, అన్నపూజ తదితర కార్యక్రమాలు నిర్వహించారు. అన్నదానం చేశారు.

ఘనంగా వాల్మీకి జయంతి



చిత్రపటానికి పూజలు చేస్తున్న భక్తులు

నందిపేట్ గ్రామీణం, న్యూస్‌టుడే: నందిపేట్ మండలం మల్లారంలోని లక్ష్మీనర్సింహస్వామి ఆలయంలో గురువారం వాల్మీకి జయంతి ఘనంగా నిర్వహించారు. మండలంలోని పలు గ్రామాల నుంచి వాల్మీకి బోయ కులస్థులు వచ్చి ప్రత్యేక పూజలు జరిపారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి భక్తిని చాటారు. అన్నదానం చేశారు. మండల అధ్యక్షుడు మల్లికార్జున్, రవికుమార్, నర్సింలు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని వినతి

భీమ్‌గల్, న్యూస్‌టుడే: మినీ అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించాలని అంగన్‌వాడీ టీచర్స్, హెల్పర్ యూనియన్ ఆధ్వర్యంలో భీమ్‌గల్ ఐసీడీఎస్ ప్రాజెక్టు సమన్వయకర్త ప్రశాంత్‌కు గురువారం వినతిపత్రం అందజేశారు. యూనియన్ జిల్లా అధ్యక్షురాలు దేవగంగు మాట్లాడుతూ.. మినీ అంగన్‌వాడీలకు గత ఐదు నెలలుగా వేతనాలు అందడం లేదని.. వచ్చేలా అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేయడంతో పాటు సహాయకులను నియమించాలన్నారు. నాయకులు యమున, మంజుల, గంగామణి, చంద్రకళ, పద్మ, వసంత తదితరులు పాల్గొన్నారు.



ఐసీడీఎస్ అధికారికి వినతిపత్రం ఇస్తున్న నాయకులు



చోదకా.. జరభద్రం

భీమ్‌గల్ మండలంలోని పల్లికొండ నుంచి బాచన్‌పల్లి వెళ్లే ప్రధాన రహదారి ఇటీవల కురిసిన వర్షాల కారణంగా చెరువు అలుగు ఉద్ధృతంగా ప్రవహించడంతో కోతకు గురైంది. అదే ప్రాంతంలో రోడ్డు మలుపు ఉండడంతో రాత్రి వేళల్లో ప్రమాదాలకు గురవుతున్నామని వాహనచోదకులు వాపోతున్నారు. అధికారులు స్పందించి రోడ్డుకు మరమ్మతులు చేపట్టాలని కోరుతున్నారు.
– న్యూస్‌టుడే, భీమ్‌గల్ గ్రామీణం

'ఎమ్మెల్యేపై చర్యలు తీసుకోవాలి'

ఆర్మూర్ పట్టణం, న్యూస్‌టుడే: ఆర్మూర్ ఎమ్మెల్యే పైడి రాకేశ్‌రెడ్డి రెచ్చగొట్టే వ్యాఖ్యలతో హిందువులను అవమాన పరుస్తున్నారని.. ఆయనపై చర్యలు తీసుకోవాలని భారాస పట్టణ అధ్యక్షుడు పూజ నరేందర్, నాయకులు గురువారం పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఆయన హిందూ సమాజాన్ని దూషిస్తూ మతకల్లోలాలు సృష్టించేందుకు కారణమవుతున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఫిర్యాదు అందజేసిన వారిలో గంగాధర్, పృథ్వీరాజ్, క్రాంతి, శ్రావణ్ కుమార్ తదితరులు ఉన్నారు.



పోలీసులకు ఫిర్యాదు చేస్తున్న భారాస నాయకులు

క్షమాపణలు చెప్పాలని డిమాండ్

ఆర్మూర్ పట్టణం, న్యూస్‌టుడే : హిందువుల మనోభావాలు దెబ్బతీసిన ఎమ్మెల్యే రాకేశ్‌రెడ్డి క్షమాపణలు చెప్పాలని ఉత్తర తెలంగాణ పార్టీ మహిళా విభాగం రాష్ట్ర అధ్యక్షురాలు అరుణజ్యోతి డిమాండ్ చేశారు. ఆర్మూర్‌లో నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఆమె మాట్లాడారు. ఆయన క్షమాపణలు చెప్పకుంటే ఇంటిని ముట్టడిస్తామని హెచ్చరించారు. నాయకులు రూప, భాగ్య, వజ్రమ్మ పాల్గొన్నారు.

నందిపేట్, న్యూస్‌టుడే: ఎమ్మెల్యే రాకేశ్‌రెడ్డిపై చర్యలు తీసుకోవాలని నందిపేట్ భారాస మండల అధ్యక్షుడు మచ్చర్ల సాగర్ అన్నారు. ఈ మేరకు గురువారం పార్టీ నాయకులు నందిపేట్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. చిన్న సాయన్న, కోమన్‌పల్లి రాజన్న, బాలగంగాధర్, తదితరులు ఉన్నారు.



నందిపేట్‌లో..

కాంగ్రెస్ గ్రామ కమిటీ ఎన్నిక

ఆర్మూర్ పట్టణం: ఆర్మూర్ మండలం హరిపూర్(పల్లె) గ్రామ కాంగ్రెస్ కమిటీ ఏకగ్రీవంగా ఎన్నికైంది. మండలాధ్యక్షుడు చిన్నారెడ్డి ఆధ్వర్యంలో గురువారం ఎన్నిక నిర్వహించారు. అధ్యక్షుడిగా రాజేందర్, ఉపాధ్యక్షుడిగా ధర్మయ్య, ప్రధాన కార్యదర్శిగా సంతోష్, కోశాధికారిగా భూమేశ్ ఎన్నికయ్యారు. శ్రీకాంత్, రంజిత్, రవి, లింబాద్రి, గంగాధర్, తదితరులు పాల్గొన్నారు.

మాక్లూర్‌లో..

మాక్లూర్: మాక్లూర్ గ్రామాభివృద్ధి కమిటీ నూతన కార్యవర్గం గురువారం ఏర్పాటైంది. అధ్యక్షుడిగా ప్రసాద్, ఉపాధ్యక్షుడిగా రమణ, కోశాధికారులుగా రవి, సంజీవ్, కార్యదర్శిగా పురుషోత్తంగౌడ్, సలహాదారులుగా రాము, లక్ష్మణ్, సభ్యులుగా నర్సయ్య, శ్రీను, అజీం, లచ్చన్న, రంగయ్య, రాములు, ఎల్లయ్య, రవి ఎన్నికయ్యారు.

ప్రయాణం.. నరకం

మాక్లూర్ మండలం మాదాపూర్ సమీపంలో ప్రధాన రహదారి కంకర తేలి, గుంతలుపడి అధ్వానంగా తయారైంది. నిత్యం వందలాది వాహనాలు ఈ మార్గంలో రాకపోకలు సాగిస్తుంటాయి. ఏ మాత్రం నిర్లక్ష్యం చేసినా ప్రమాదాల బారిన పడడం ఖాయం. రాత్రివేళల్లో ప్రయాణికుల అవస్థలు అన్నీఇన్నీ కావు. గుంతల్లో పడి పలువురికి గాయాలైన ఘటనలు ఉన్నాయి. అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి రహదారిని బాగుచేయించాలని ప్రజలు కోరుతున్నారు.
– న్యూస్‌టుడే, మాక్లూర్



మాదాపూర్ సమీపంలోని రోడ్డు దుస్థితి

ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలి

ఆర్మూర్ పట్టణం, న్యూస్‌టుడే: కాంగ్రెస్ ప్రభుత్వం విద్యార్థులకు అన్యాయం చేస్తుందని బీవీఎం రాష్ట్ర అధ్యక్షుడు శ్రీధర్ అన్నారు. గురువారం ఆర్మూర్‌లో విద్యార్థులతో కలిసి నిరసన తెలిపారు. బడ్జెట్‌లో విద్యారంగాన్ని నిధులు కేటాయించడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందన్నారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలని కోరారు. కార్యక్రమంలో అజయ్, నవీన్, ప్రణయ్, అనిల్, లావణ్య, దీక్షిత, దివ్య, రాణి, మేఘన, మనీష పాల్గొన్నారు.



నిరసనలో పాల్గొన్న విద్యార్థులు

ఉదయం డంపు.. రాత్రి తరలింపు

☛ ఏర్గట్ల మండలంలో యథేచ్ఛగా ఇసుక తవ్వకాలు

– న్యూస్‌టుడే, ఏర్గట్ల

ఏర్గట్ల మండలంలో ఇసుక దందా జోరుగా సాగుతోంది. తడపాకల్, గుమ్మిర్యాల్, దోంచంద గ్రామాల్లోని గోదావరి నది.. తొర్తి, బట్టాపూర్ గ్రామాల పెద్దవాగు తీరాన యథేచ్ఛగా తవ్వకాలు చేపడుతున్నారు. పగటిపూట ట్రాక్టర్లతో యథేచ్ఛగా గ్రామాల్లోని ఖాళీ ప్రదేశాల్లో డంపులు పోసి రాత్రి వేళ తరలిస్తున్నారు. ఇంత జరుగుతున్న అధికారులు పట్టించుకోకపోవడంతో వీరి వ్యాపారం.. **'మూడు పువ్వులు.. ఆరు కాయలు'** అన్న చందంగా సాగుతోంది.

పట్టణాలకు తరలిస్తూ..

గ్రామీణ ప్రాంతాల్లో స్థానిక అవసరాలకు ఇసుక ఉచితమని రాష్ట్ర ప్రభుత్వం గతంలో ప్రకటించింది. దీనిని ఆసరాగా చేసుకొని కొందరు గ్రామ శివార్లలోని నూతన నిర్మాణాల దగ్గర అవసరానికి మించి డంపులు పోస్తున్నారు. పట్టణాల్లో ఇళ్ల నిర్మాణాలు పెరగడంతో రాత్రిపూట డంపు చేసిన ఇసుకను గుట్టుచప్పుడు కాకుండా తరలిస్తున్నారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఇసుక తీసుకెళ్లాలంటే తహసీల్దారుకు డీడీ చెల్లించి వే బిల్లులు తీసుకోవాలి. కాని అలా ఎక్కడా కనిపించడం లేదు. ఎప్పుడైనా ప్రజల నుంచి ఫిర్యాదులొస్తే అధికారులు ఒకట్రెండు డంపులు జప్తు చేసి వదిలేస్తున్నారని ప్రజలు ఆరోపిస్తున్నారు.



తాళ్లరాంపూర్‌లో ఇసుక నిల్వలు

కఠిన చర్యలు తీసుకుంటాం
– శ్రీలత, తహసీల్దార్, ఏర్గట్ల

ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఇసుక తరలింపు జరగాలి. అనుమతులు లేకుండా ఇసుక తరలిస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకుంటాం.

సమయపాలన పాటించాలి



మాట్లాడుతున్న డిప్యూటీ డీఎంహెచ్‌వో రమేష్

నందిపేట్, న్యూస్‌టుడే: వైద్యశాఖ ఉద్యోగులు సమయపాలన పాటిస్తూ రోగులకు నాణ్యమైన సేవలు అందించాలని డిప్యూటీ డీఎంహెచ్‌వో రమేష్ అన్నారు. డొంకేశ్వర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని గురువారం ఆయన తనిఖీ చేశారు. రికార్డులు పరిశీలించారు. ఫ్రైడే డ్రైడేను పకడ్బందీగా నిర్వహించాలన్నారు. పీహెచ్‌సీ వైద్యులు విద్యాసాగర్, సిబ్బంది సురేందర్, కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్తు డీఈకి సన్మానం

ఆర్మూర్ పట్టణం, న్యూస్‌టుడే: ఆర్మూర్ విద్యుత్తు డీఈగా పనిచేసి బదిలీపై నిర్మల్ వెళ్తున్న హరిచంద్‌ను గురువారం ఆర్మూర్ విద్యుత్తు ఎంప్లాయీస్ 1104 యూనియన్ ప్రతినిధులు సన్మానించి, జ్ఞాపికను బహూకరించారు. విద్యుత్తు సిబ్బంది, కార్మికుల పక్షపాతిగా ఆయన సేవలు అందించారని కొనియాడారు. యూనియన్ ప్రధాన కార్యదర్శి నరేందర్‌నాయక్, కార్యనిర్వాహక అధ్యక్షుడు ప్రదీప్‌గౌడ్, గంగారాం, సురేశ్ బాబు, నర్సయ్య, వేణుగోపాల్, షకీల్, రాజేందర్, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.



నూతన నియంత్రిక ఏర్పాటు

ఆర్మూర్ పట్టణం: పట్టణ పరిధిలోని మామిడిపల్లి సబ్‌స్టేషన్‌లో 5 ఎంవీఏ నూతన నియంత్రికను ఏర్పాటు చేసినట్లు విద్యుత్తు శాఖ కో ఎస్సీ రవీందర్ అన్నారు. డీఈ ఎంఆర్‌టీ రాజేశ్వర్, డీఈ ఆపరేషన్ హరిచంద్, ఏడీఈలు రాజేశ్వర్, శ్రీనివాస్, జేఈ మౌనిక, సిబ్బంది ఉన్నారు.

వాహనాల తనిఖీ

ముప్కాల్(బాల్కొండ): ముప్కాల్‌లో పోలీసులు, రవాణా శాఖ అధికారులు సంయుక్తంగా గురువారం వాహనాల తనిఖీ నిర్వహించారు. ఆర్మూర్ ఎంవీఐ వివేకానందరెడ్డి, ఆర్మూర్ ట్రాఫిక్ సీఐ రమేష్, ముప్కాల్ ఎస్సై రజనీకాంత్ తనిఖీలు చేపట్టారు. నంబర్ ప్లేట్లు లేకుండా నడుపుతున్న 14 వాహనాలు, లైసెన్స్ లేకుండా నడిపిన మరో నాలుగింటిని ఠాణాకు తరలించారు. శిరస్త్రాణం ధరించకుండా ద్విచక్రవాహనాలు నడుపుతున్న 15 మందికి జరిమానాలు విధించారు.

వివాహిత అదృశ్యం

మోర్తాడ్: మండలానికి చెందిన ఓ వివాహిత కనిపించడం లేదని ఆమె భర్త ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై విక్రమ్ గురువారం తెలిపారు

ఉరేసుకొని బలవన్మరణం

భీమ్‌గల్, న్యూస్‌టుడే: మద్యానికి బానిసై ఉరేసుకొని మృతి చెందిన ఘటన భీమ్‌గల్ పట్టణంలో చోటు చేసుకుంది. భీమ్‌గల్ ఎస్సై మహేశ్ కథనం ప్రకారం.. పట్టణానికి చెందిన దడివె రాజేందర్(59) గత కొన్నేళ్లుగా మద్యానికి బానిసయ్యారు. నిత్యం తాగి ఇంటికి వచ్చేవారు. బుధవారం మధ్యాహ్నం మద్యం తాగి ఇంటికి రావడంతో ఎందుకు తాగావని భార్య శోభ ప్రశ్నించింది. కోపంతో ఇంటి నుంచి వెళ్లిపోయిన ఆయన పట్టణ శివారులో అడ్డగుట్ట ప్రాంతంలో చెట్టుకు ఉరేసుకున్నాడు. స్థానికులు గమనించి విషయాన్ని కుటుంబ సభ్యులు, పోలీసులకు చెప్పారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



రాజేందర్

రోడ్డు ప్రమాదంలో ఉద్యోగి దుర్మరణం

రాంచంద్రపల్లి(మాక్లూర్ గ్రామీణం), న్యూస్‌టుడే: మాక్లూర్ మండలం రాంచంద్రపల్లి జాతీయ రహదారిపై గురువారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతిచెందిన సంఘటన చోటు చేసుకుంది. ఎస్సై శేఖర్ కథనం ప్రకారం.. ఆర్మూర్‌లోని పెర్కిట్‌కు చెందిన పుచ్చుల సుమన్(35) తునికలు కొలతల శాఖలో ఉద్యోగిగా పనిచేస్తున్నారు. గురువారం పని ముగించుకుని నిజామాబాద్ నుంచి పెర్కిట్‌కు వెళ్తుండగా.. రాంచంద్రపల్లి వద్ద అతివేగంగా వస్తున్న కారు ద్విచక్రవాహనాన్ని ఢీకొట్టడంతో సుమన్ అక్కడికక్కడే మృతి చెందాడు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.



సుమన్

క్రైమ్ కార్నర్

ద్విచక్రవాహనం బోల్తా.. యువకుడి మృతి

కమ్మర్‌పల్లి, న్యూస్‌టుడే: కమ్మర్‌పల్లి విద్యుత్తు ఉప కేంద్రం సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో దిబ్బ అనిల్(20) అనే యువకుడు మృతి చెందినట్లు గురువారం ఏఎస్సై నరేందర్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. ఏర్గట్ల మండలం తాళ్లరాంపూర్‌కు చెందిన దిబ్బ అనిల్, కనుగుర్తి శివరాజ్‌లు బుధవారం రాత్రి ద్విచక్రవాహనంపై బషీరాబాద్‌కు వెళ్లారు. అదే రోజు రాత్రి తిరిగి వస్తుండగా కమ్మర్‌పల్లి సమీపంలోని మూల మలుపు వద్ద వాహనం అదుపు తప్పి వ్యవసాయక్షేత్రాల్లోకి దూసుకెళ్లి బోల్తాపడింది. తలకు తీవ్రగాయాలైన అనిల్ సంఘటన స్థలంలో మరణించాడు. వెనుక కూర్చున్న శివరాజ్‌కు గాయాలు కాగా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఏఎస్సై పేర్కొన్నారు.

ఆయిల్ చోరీ

ఆర్మూర్ పట్టణం: పట్టణ పరిధిలోని పెర్కిట్‌లో 51/100 కేవీఏ నియంత్రిక నుంచి ఆయిల్ చోరీ అయింది. బుధవారం రాత్రి ట్రాన్స్‌ఫార్మర్‌ను ధ్వంసం చేసి ఆయిల్‌ను ఎత్తుకెళ్లినట్లు లైన్ ఇన్‌స్పెక్టర్ గంగారాం ఆర్మూర్ ఠాణాలో గురువారం ఫిర్యాదు చేశారు.

భాజపా సభ్యత్వ నమోదు

దొన్కల్(మోర్తాడ్): దొన్కల్‌లో గురువారం భాజపా నాయకులు సభ్యత్వ నమోదును నిర్వహించారు. కార్యక్రమానికి భాజపా మాజీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు భూపతిరెడ్డి పాల్గొన్నారు. మండలాధ్యక్షుడు నరేశ్, ముత్యంరెడ్డి, శ్రీనివాస్, మల్లేశ్, గంగారెడ్డి పాల్గొన్నారు.